J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 27.03.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 43 పేజీలు : 12, వెల : ₹ 5




లాయర్
వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

# కర్కశ కరోనాతో... భారత్ లా(బ్లా)క్




## 21రోజుల పాటు దేశం దిగ్బంధం

- కరోనాపై పోరాటంలో కఠిన నిర్ణయాలు
- ప్రధాని మోడీ చర్యలను ప్రశంసిస్తున్న ప్రపంచ దేశాలు
- దేశ వ్యాప్తంగా స్థంభించిన అన్ని రకాల వ్యవస్థలు
- వైరస్‌ను ఎదుర్కొనే దిశగా ప్రభుత్వాలు అప్రమత్తం
- ప్రధాని పిలుపుకు పెరుగుతున్న ఆదరణ
- వైరస్ చైన్ బ్రేక్ చేయడానికి లాక్‌డౌన్ ప్రధాన మార్గం
- కుటుంబ సమేతంగా ఇంట్లో గడుపుతున్న భారతీయులు

చైనా కమ్యూనిష్టు దేశం... అక్కడ మాట వినకపోతే కాల్చిపడేస్తారు. అమెరికా పూర్తిగా అభివృద్ధి చెందిన దేశం. ప్రజలు తక్కువ... విజ్ఞానవంతులు ఎక్కువ. కాబట్టి అక్కడ ప్రజలను క్రమశిక్షణతో నడపొచ్చు. కాని, భారతదేశంలో అది సాధ్యం కాదు... ఇక్కడ ఎడ్డెం అంటే తెడ్డెం అనేవాళ్ళు ఎక్కువ. ఒక మంచి మాట చెబితే దానికి వక్రభాష్యాలు పలికేవాళ్ళు ఎక్కువ. ఇలాంటి పరిస్థితులున్న భారతదేశాన్ని ఇప్పుడు ఒకే మాట, ఒకే బాటపై నడుపుతున్న నాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. ఈరోజు ప్రజలు మెచ్చిన నాయకుడే కాదు, ప్రపంచమంతా కూడా ప్రశంసిస్తున్న నాయకుడు నరేంద్ర మోడీ!

కరోనా వైరస్ మహమ్మారి ప్రపంచాన్నంతా వణికిస్తున్న నేపథ్యంలో 130కోట్ల భారతావనిని ఈ వైరస్ కబంధహస్తాల నుండి విముక్తం చేయడానికి భారత ప్రధానిగా నరేంద్ర మోడీ చేపడుతున్న చర్యలు, తీసుకుంటున్న నిర్ణయాలు చరిత్రగా నిలవనున్నాయి. కరోనా వైరస్ పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఈ దేశం ఎలాంటి ముప్పును ఎదుర్కోవాల్సివుంటుందో మోడీ గ్రహించాడు. ముఖ్యంగా ఈ విషయంలో ఇటలీ దేశ పరిస్థితులు పెద్ద గుణపాఠమవుతున్నాయి. (మిగతా 11వ పేజీలో)




# వరల్డ్‌ను చుట్టేసిన వైరస్

- అష్టదిగ్బంధనంలో ప్రపంచం
- 200 దేశాలకు పాకిన కరోనా
- అతలాకుతలమైన ఇటలీ
- వైరస్‌తో విలవిల్లాడుతున్న ఇరాన్, ఫ్రాన్స్, స్పెయిన్, అమెరికా

ప్రపంచం ఇలాంటి ఉత్పాతాన్ని ఎప్పుడూ ఎదుర్కొని ఉండదు. భూగోళం ఇంతటి ముప్పును ఎప్పుడూ చవిచూసి వుండదు. ప్రపంచంలోని దేశాలన్నీ ఇంతకాలం కంటికి కనిపించే శత్రువులతోనే యుద్ధం చేస్తూ వచ్చాయి.

కాని, చరిత్రలోనే తొలిసారిగా ఈ భూగ్రహంపై వుండే 200 దేశాలు కంటికి కనిపించని శత్రువుతో అలుపెరుగని పోరాటం చేస్తున్నాయి. (మిగతా 11వ పేజీలో)



# ఐసొలేషన్ కేంద్రంగా బీవీపాళెం రిసార్ట్

తడ మండలంలోని భీములవారిపాళెంలో ఉన్న పర్యాటక శాఖ రిసార్ట్‌ను ఐసొలేషన్ కేంద్రంగా గుర్తించినట్లు పర్యాటక శాఖ జిల్లా అధికారి శ్రీనివాసకుమార్ పేర్కొన్నారు. పర్యాటక శాఖ రిసార్ట్‌ను ఆయ ఈనెల 22న పరిశీలించారు. జిల్లా కలెక్టర్ సూచనలతో దీనిని ఐసొలేషన్ కేంద్రం కోసం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జనావాసాలకు దూరంగా ఉండడంతో పాటు పలు సదుపాయాలు కూడా ఇక్కడ ఉండడంతో ఈ రిసార్ట్‌ను ఎంపిక చేశామన్నారు. 15 గదులు, మరుగుదొడ్లు, పార్కింగ్ వసతి ఉన్నాయని, కరోనా నేపథ్యంలో అనుమానిత కేసులను 14రోజుల పాటు ఇక్కడ ఉంచేందుకు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

## చెక్‌పోస్ట్ వద్ద వైద్యబృందాల పరీక్షలు

పొరుగు రాష్ట్రమైన తమిళనాడు నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించేవారికి వైద్యపరీక్షలు చేసి అనుమానిత కేసులను గుర్తించేందుకు జిల్లా అధికారుల ఆధ్వర్యంలో భీములవారిపాళెం చెక్‌పోస్ట్ వద్ద వైద్య బృందాలు నిర్వహిస్తున్న వైద్యపరీక్షలు కొనసాగుతున్నాయి. తడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రవిరామ్‌తో పాటు, ఎఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు.

సింహపురి సమాచారం


## మలేరియా నిర్మూలనకు..

# నడుం బిగించాలి

**- జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు**



మలేరియా వ్యాధి నిర్మూలనకు అందరూ చిత్తశుద్ధితో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. ఈనెల 20న ఆయన జడ్పీ ఆవరణంలోని జిల్లా ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మలేరియాను నిర్మూలించాలంటే దోమల ఉత్పత్తిని అరికట్టాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలను పక్కాగా చేపట్టాలని, మురుగు కాలువలు, మురుగుగుంటల్లో దోమల లార్వాలను నిర్మూలించేందుకు గంబూషియా చేపలను వదలాలని, మలేరియా జ్వరాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు పోస్టర్లు, కరపత్రాలతో ప్రచారం చేయాలని, పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్, డిఆర్‌ఓ మల్లికార్జునరావు, డిఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డిపిఓ ధనలక్ష్మి, మలేరియా అధికారి మనోరమ పాల్గొన్నారు.



## వెలవెలబోతున్న షార్

భారత ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు ఈనెల 22న జనతా కర్ఫ్యూ జిల్లాలో సంపూర్ణంగా విజయవంతమైంది. అంతరిక్ష పరిశోధనాకేంద్రమైన షార్ లోనూ, పరిసర ప్రాంతాల్లోనూ జనసంచారం కనిపించలేదు. షార్ ప్రధాన ద్వారమైన మొదటి గేటు పరిసరాల్లోనూ జన సంచారం లేదు. కరోనా వ్యాధి నేపథ్యంలో ఎవరికి వారు అందరూ స్వచ్ఛంధంగా జనతా కర్ఫ్యూను పాటించడంతో అంతా నిర్మానుష్య వాతావరణం ఏర్పడింది. షార్ లోని కాలనీల్లోను, ఇతరత్రా కాలనీల్లోనూ ప్రజలెవరూ బయటకు రాలేదు.

## మధ్యాహ్నం 2 దాకే బ్యాంకులు

కరోనా నివారణకు తీసుకుంటున్న ముందస్తు చర్యల్లో భాగంగా బ్యాంకుల పనివేళల్లో మార్పులు చేస్తూ ఈనెల 23న రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి నిర్ణయాలు తీసుకుంది. ఈనెల31వతేది వరకు బ్యాంకులన్నీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల దాకా పనిచేస్తాయని, నగదు లావాదేవీలు, చెక్ క్లియరింగ్ సర్వేసెస్ ఫండ్స్ (రెమిటెన్స్) ప్రభుత్వ లావాదేవీలు మాత్రమే జరుగుతాయని, విడతలవారీగా ఉద్యోగులు విధుల్లో పాల్గొనాలని, ఏదైనా సున్నితమైన ప్రాంతంగా అధికారులు ప్రకటిస్తే, ఆయా ప్రాంతాల్లో బ్యాంకు శాఖలను నిలిపివేయాలని బ్యాంకర్ల సమితి నిర్ణయించినట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. అన్ని బ్యాంకుల ఏటిఎంలు యధావిధిగా అందుబాటులో ఉంటాయని, ఖాతాదారులు డిజిటల్ లావాదేవీలు, ఇతర సదుపాయాలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

## దర్గాల్లో దర్శనాలు నిలిపివేత

కరోనా వైరస్ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి 31వ తేది వరకు జిల్లాలోని ప్రముఖ దర్గాల్లో దర్శనాలను నిలిపివేస్తున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ అధికారి అబ్దుల్ హమీద్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ అహ్మద్‌భాషాలు పేర్కొన్నారు. నెల్లూరులోని పలు మసీదులను పరిశీలించి కరోనా వైరస్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

## 1న పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

బయోమెట్రిక్ లేకుండానే రిజిస్టర్ల ఆధారంగా ఏప్రిల్ 1వ తేదిన పింఛన్లు పంపిణీ చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. కరోనా వైరస్ నేపథ్యంలో త్వరితగతిన ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. అర్హులందరికీ ఇళ్ళ వద్దనే పింఛన్లు అందజేసేందుకు లబ్ధిదారులు అందుబాటులో ఉండేలా అధికారులు కృషి చేస్తున్నారు. ఇందుకు సంబంధించి గ్రామ, వార్డు వాలంటీర్లకు మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేశారు. 1వ తేది ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభంకానుంది. కొద్ది గంటల వ్యవధిలోనే ఈ కార్యక్రమం పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.


## ఆధ్యాత్మిక సారధి.. ధార్మిక సేవా వారధి..

# ఆదినారాయణరెడ్డి ఇక లేరు

నెల్లూరు జిల్లా ఆధ్యాత్మిక రంగంలో స్ఫూర్తిని నింపిన ఆదర్శ పురుషుడు ఆల్తూరు ఆదినారాయణరెడ్డి. భక్తి తత్వమే ముక్తి మార్గం అన్న సూక్తిని తూ.చ తప్పక పాటిస్తూ తాను ఆధ్యాత్మికతత్వంతో జీవించడంతో పాటు జిల్లాకి చెందిన అనేక మంది ప్రముఖులకు అయన ఆదర్శంగా మారాడు.

షిరిడి సాయి సేవకోసం జన్మించిన ఈ తరం ప్రతినిధిగా, శివయ్యను కొలవడానికి అవతరించిన అపర భక్తకన్నప్పగా, అమ్మణ్ణి ఆరాధనతో తరించిన ఆరాధ్య భక్తుడిగా ఆధ్యాత్మిక రంగంలో అయన అందించిన సేవలు చిరస్మరణీయం.

ఒక్క నెల్లూరులోనే కాకుండా జిల్లావాసులకు సంభందించి ఎక్కడ ఏ శుభకార్యక్రమం జరిగినా ఖచ్చితంగా సతి సులోచనమ్మ తోడుగా హాజరుకావడం ఆయనకు అలవాటు. షిరిడి సాయిబాబా ప్రతిమను బహుకరించడం అయన ఆన వాయితీ. ఆ అపర భక్తిపరాయణుడు ఆదినారాయణుడు మనకిక లేడు.



భారతదేశంలో తిరుమల తిరుపతి దేవస్థానం తర్వాత పెద్ద ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న షిరిడి సాయిబాబా మందిరంలో సాయినాథునికి 13కోట్ల ఖర్చుతో తయారు చేయించిన స్వర్ణ సింహాసనాన్ని చూస్తే ఎవరికైనా ఇట్టే ఆల్తూరు ఆదినారాయణరెడ్డి కుటుంబం గుర్తుకు వస్తుంది. సాయిబాబా పట్ల వున్న భక్తితో ఆయనకు తమ సొంత నిధులు 13కోట్లతో బంగారు సింహాసనాన్ని తయారు చేయించింది ఆల్తూరు ఆదినారాయణరెడ్డి కుటుంబమే.

ఆధ్యాత్మిక చింతనాతత్పరుడు, శ్రీశైల దేవస్థాన మాజీఛైర్మెన్ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి ఈ నెల 23వ తేదీన హైదరాబాద్‌లో ఆకస్మాత్తుగా గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన వయసు 74 సంవత్సరాలు. ఆయనకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు ఆల్తూరు గిరీష్‌రెడ్డి... వ్యాపారవేత్తగానే కాకుండా నెల్లూరులోని మూలస్థానేశ్వరస్వామి దేవ స్థానం మాజీఛైర్మెన్‌గా, జిల్లాలో ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాల రూప శిల్పిగా అందరికీ సుపరిచితుడు. రెండో కుమారుడు ఏఎంఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఆల్తూరు మహేష్‌రెడ్డి. దేశంలోనే పేరెన్నికగన్న కాంట్రాక్టర్. ఆదినారాయణరెడ్డి సహధర్మచారిణి సులోచన. ఈ కుటుంబం చేస్తున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్న భక్తురాలు.

టి.పి.గూడూరు మండలం పాపిరెడ్డిపాలెం వారి స్వగ్రామం. కాంట్రాక్ట్ రంగంలో అంచెలంచెలుగా ఎదిగిన ఆల్తూరు కుటుంబం తాము ఏదిచ్చినా, తమకు ఏమొచ్చినా అది భగవంతుడు ఇచ్చాడనే భావించేవాళ్ళు. వ్యాపార రంగంలో తమకొచ్చిన లాభాలలో సగభాగం వాళ్ళు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకే ఖర్చు చేసేవాళ్ళు. షిరిడి సాయిబాబాకు స్వర్ణసింహాసనాన్ని చేయించడంతో పాటు దేశ వ్యాప్తంగా ఎన్నో గుళ్ళు గోపురాలకు ఆల్తూరు ఆదినారాయణరెడ్డి కుటుంబం భూరి విరాళాలు అందజేసింది. భగవంతుడికి సేవచేసుకోవాలనే వారి సంకల్పం వల్లే కాణిపాకం, శ్రీకాళహస్తి, శ్రీశైలం ఆలయాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. నెల్లూరు నగరంలో శ్రీతల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం, శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానాలలో అభివృద్ధి కార్యక్రమాలకు, గాలిగోపురాల నిర్మాణాలకు వారు ఎంతో ఆర్థిక సహకారం అందిం చారు. విడవలూరు మండలం రామతీర్థంలో శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం జీర్ణోద్ధరణకు ఆల్తూరు కుటుంబం ఎంతగానో సహకరించింది.

ఆల్తూరు ఆదినారాయణరెడ్డి ఆధ్యాత్మిక సేవలు మెచ్చే గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆయనను శ్రీశైలం దేవస్థానం పాలకమండలి ఛైర్మెన్‌గా నియమించడం, ఛైర్మెన్‌గా ఆయన దేవస్థానం అభివృద్ధి కోసం ఎన్నో చర్యలు చేపట్టడం కూడా జరిగింది.



ఇప్పటి, అప్పటి భారత రాష్ట్రపతులు రామ్‌నాథ్ కోవింద్, ప్రతిభా పాటిల్‌లతో...




భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో...

### ఆదినారాయణరెడ్డి-సులోచనమ్మ దంపతులకు 'లాయర్' ఆధ్వర్యంలో మళ్ళీ పెళ్లి



2016 ఏప్రిల్ 15వ తేదీ శ్రీరామనవమి పండుగ పర్వదినాన 'లాయర్' ప్రచురించిన 'పెళ్లిపుస్తకం' ఆవిష్కరణ సందర్భంగా పెళ్లై 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 17 జంటలకు వేదపండితుల ఆశీర్వచనంతో మళ్లీ పెళ్లిని నిర్వహించింది 'లాయర్' వారపత్రిక. ఆ సందర్భంగా ఆదినారాయణరెడ్డి – సులోచనమ్మ దంపతులకు వేదపండితుల ఆశీర్వచనం అందించి మళ్ళీ పెళ్లి చేసే భాగ్యం 'లాయర్'కు కలిగింది.

### మైపాడు బీచ్‌లో ద్వాదశ జ్యోతిర్లింగాలు




ప్రపంచ ప్రసిద్ధిగాంచిన 12 జ్యోతిర్లింగాలను పోలిన 12 దేవా లయాలు ఆయా దేవాలయాలను పోలినట్లుగానే(రెప్లిగా) నెల్లూరుజిల్లా మైపాడు తీర ప్రాంతంలో దాతల సహకారంతో నిర్మింప చేయడంలో ఆదినారాయణరెడ్డి కృషి అసామాన్యం. ఆయన మదిలో మెదిలిన ఆలోచనను కళారూపం దాల్చడానికి ఆయన పడ్డ తపన అంతా ఇంతా కాదు. గుజరాత్‌లోని సోమ్‌నాథ్, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైల మల్లిఖార్జున స్వామి, మధ్యప్రదేశ్‌లోని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, జార్ఖండ్‌లోని వైద్యనాదేశ్వర్, మహారాష్ట్రలోని భీమాశంకర్, తమిళనాడులోని రామేశ్వర్, గుజరాత్‌లోని నాగేశ్వర్, వారణాసిలోని కాశీవిశ్వనాథుడు, నాసిక్‌లోని త్రయంబకేశ్వర్, ఉత్తరాఖండ్‌లోని కేధారనాథ్, ఔరంగాబాద్‌లోని ఘ్రిష్నేష్వర్ ఆలయాలను పోలిన విధంగా దక్షిణ భారతదేశంలోనే మన నెల్లూరుజిల్లాలో నిర్మింపజేసిన ఘనత ఆదినారాయణరెడ్డిది.

### భక్తి సినిమాలు

శ్రీ షిరిడి సాయిబాబా అంటే ఆల్తూరు కుటుంబసభ్యులకు భక్తే కాదు, ప్రేమ కూడా! సాయిబాబా చరిత్రను అక్కినేని నాగార్జున హీరోగా కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో 'షిరిడి సాయి' పేరుతో తెరకెక్కించడం తెలిసిందే! అలాగే కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తుడు హాదీరామ్‌జీ చరిత్రతో నాగార్జున హీరోగా 'ఓం నమో వేంకటే శాయ' అనే భక్తి చిత్రాన్ని కూడా తెరకెక్కించారు.

### జన్మభూమిలోనే అంత్యక్రియలు

ఆల్తూరు ఆదినారాయణరెడ్డి అంత్యక్రియలు 24వ తేదీన స్వగ్రామమైన పాపిరెడ్డిపాలెం సమీపంలోగల ఆయన తోటలోనే నిర్వ హించారు. సాధారణ పరిస్థితులు వుంటే ఆల్తూరు ఆదినారాయణరెడ్డి కడచూపుకు ప్రజలు వేలాదిగా తరలివచ్చేవాళ్ళు. ప్రజాప్రతినిధులు, ప్రముఖుల తాకిడి కూడా అధికంగా వుండేది. కరోనా వైరస్‌పై చర్యల నేపథ్యంలో వున్న ఆంక్షల వల్ల కొన్ని వందలమందికి మాత్రమే ఆయనను చివరిచూపు చూసే అవకాశం దక్కింది. తాను నిత్యం ఏ భగవంతుడినైతే కొలుస్తూ వున్నాడో ఆ భగవంతుడి పిలుపుమేరకు ఆయన సన్నిధికి చేరిన ఆల్తూరు ఆదినారాయణరెడ్డి మృతికి నివాళులర్పిస్తూ... వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



### ప్రముఖుల నివాళి

ఈనెల 24వ తేదీ ఉదయం ఆదినారాయణరెడ్డి పార్థివదేహాన్ని నెల్లూరులోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో వున్న అతిథి గృహానికి తీసుకువచ్చారు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టిటిడి పాలకమండలి సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి, మున్సిపల్ మాజీఛైర్మెన్ టి.అనూరాధ, సహకార బ్యాంక్ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కెన్సెస్ గ్రూప్ అధినేత నరసారెడ్డి, వైఎస్సార్సీపి నాయకులు రూప్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నుడా మాజీ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి,





అలయన్స్ గ్రూప్ అధినేత నంబూరు మనోజ్, వైసిపి నాయకులు కొడవలూరు ధనుంజయరెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి తదితర ప్రముఖులు ఆల్తూరు వారి నివాసానికి విచ్చేసి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆదినారాయణరెడ్డి పెద్దకుమారుడు గిరీష్‌రెడ్డి శోకతప్త హృదయంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆల్తూరు కుటుంబ అను చరులు, పలువురు ప్రముఖులు, సన్నిహితులు, భక్తులు, ప్రజలు ఆల్తూరు ఆదినారాయణరెడ్డికి కడసారి కన్నీటి నివాళులర్పించారు. 25వతేదీ రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్ వారి ఇంటికి వెళ్లి ఆదినారాయణరెడ్డి చిత్రపటం వద్ద పూల చల్లి నివాళు లర్పించారు. ఆల్తూరు కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు.

## 'ప్రభా'తం

# వెల్లువెత్తిన చైతన్యం



కరోనా వైరస్‌పై సాగిస్తున్న సమరంలో భాగంగా ఈ నెల 22న ప్రజలంతా జనతా కర్ఫ్యూను పాటించాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుతో దేశం ఎంతో బాగా స్పందించింది. ప్రజలు ఎక్కడికక్కడ తమ ఇళ్లకే పరిమితమయ్యారు. ఎక్కడా బలవంతం లేదు, ప్రజలే స్వచ్ఛందంగా కర్ఫ్యూకు మద్దతు పలికారు. ఇదే స్ఫూర్తితో భారత జాతి కరోనావైరస్‌పై సుధీర్ఘ పోరాటానికి శ్రీకారం చుట్టింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ 21రోజుల పాటు లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చాడు. భవిష్యత్ భద్రంగా వుండాలంటే మనము ఈరోజు కొన్ని సమస్యలను ఎదుర్కో వాలి... ఇబ్బందులను భరించాలి. ఇవన్నీ ఓర్చుకుంటేనే రేపు మనదవుతుంది.

ఒక్క పిలుపు.. ఒకే ఒక్క పిలుపు 130 కోట్ల మంది భారతీయులను ఏకతాటిపై నిలిపింది. 29 రాష్ట్రాలను ఒకే విధానంలో నడిపింది. కులం మరిచారు, మతం విడిచారు... తామంతా ఒకటేనని చాటారు. దేశం కోసం ఏకమవుదాం, దేశ హితం కోసం ఒకటిగా సాగుదాం... అని చాటిచెప్పారు. దేశ చరిత్రలోనే 130 కోట్ల మంది ప్రజలు ఒకే మాటపై నిలబడిన సందర్భం అద్భుతం.

ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్‌ను ఎదుర్కొనే క్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన జనతా కర్ఫ్యూకు దేశ ప్రజల నుంచి వచ్చిన స్పందన అమోఘం.. అద్వితీయం! చరిత్రలో మనం చూస్తే.. స్వాతంత్ర సంగ్రామ సమయంలో అలాంటి స్ఫూర్తి ప్రజలలో కనిపించింది. ఆనాడు మహాత్మా గాంధీ పిలుపుకు ప్రజలు లక్షల్లో రోడ్ల మీదకు వచ్చి తెల్లదొరలకు వ్యతిరేకంగా పోరాడారు. అయితే ఈ రోజు ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు ప్రజలను రోడ్ల మీద నుండి ఇళ్లల్లోకి పొమ్మని. 24 గంటల పాటు మీ ఇళ్ళల్లోనే ఉండండి అని ఆయన ఇచ్చిన పిలుపు బ్రహ్మాండంగా పనిచేసింది. భారత దేశ ప్రజల చైతన్యాన్ని చాటింది. 29 రాష్ట్రాలు... మెట్రో నగరాలు, పట్టణాలు, పల్లెలు.... ఎక్కడా ఆ తేడా అన్నది లేదు. పట్టణాల్లో మాదిరిగానే పల్లెల్లోనూ కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం తమను తాము ఇళ్లల్లో నిర్బంధించుకున్నారు. దేశం కోసం ఒకరోజు కాదు అవసరమైతే వారం, నెల అయినా ఇళ్లల్లో ఉంటాము అన్నట్టుగా తమ సంఘీభావాన్ని చాటారు.

కరోనా వైరస్‌పై సాగిస్తున్న సమరంలో భాగంగా ఈనెల 22న ప్రజలంతా జనతా కర్ఫ్యూను పాటించాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుతో దేశం ఎంతో బాగా స్పందించింది. ప్రజలు ఎక్కడికక్కడ తమ ఇళ్లకే పరిమితమయ్యారు. బస్సులు, రైళ్ల లేవు. విమానాలు లేవు, దుకాణాలు లేవు. వ్యాపార, వాణిజ్య సముదాయాలను మూసివేశారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎక్కడా బలవంతం లేదు, ప్రజలే స్వచ్ఛందంగా కర్ఫ్యూకు మద్దతు పలికారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో ఆపత్కాలంలో కూడా వ్యాధిగ్రస్తులకు తమ వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందికి, పోలీసులకు, పారిశుద్ధ్య కార్మికులకు, ప్రభుత్వ శాఖల సిబ్బందికి ప్రధాని మొదలుకొని భిక్షగాడి వరకు చప్పట్లతో అభినందించిన తీరు అనిర్వచనీయం.

ఈరోజు ప్రపంచం అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. చైనాలో మొదలయిన ఈ వైరస్ భూగోళాన్ని చుట్టేసింది. చైనాలో ఇప్పుడిప్పుడే పరిస్థితులు కుదుట పడుతున్నాయి. వైరస్ పుట్టుకకు కారణమైన ఊహాన్ నగరంలో కేసుల నమోదు ఆగిపోయింది. అయితే ఈ వైరస్ మూలంగా ఇటలీ దేశం మాత్రం తీవ్రంగా నష్టపోయింది. వైరస్ చైనాలో పుట్టినప్పటికీ దీని మూలంగా అత్యధికంగా ప్రాణ నష్టం జరిగింది ఇటలీలోనే. ఇప్పటికే ఆ దేశంలో ఏడు వేల మందికిపైగా మృత్యువాత పడ్డారు. లక్ష మందికి పైగా వైరస్ బారినపడి మరణంతో పోరాటం చేస్తున్నారు. వైద్య సహాయం అందించలేక ఆ దేశ అధ్యక్షుడు కంటతడి పెట్టాడు. అభివృద్ధి చెందిన ఇటలీ దేశమే ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోలేకుంటే.. ఇక ఇరాన్, స్పెయిన్ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూస్తున్నాం. ఇటలీ తర్వాత ఈ రెండు దేశాలలోనే కరోనా మరణాలు ఎక్కువగా ఉన్నాయి.

ఈ మహమ్మారిని ఎదుర్కొనే విషయంలో భారత ప్రభుత్వం చూపిన చొరవ ఎంతైనా అభినందనీయం. ఈ విషయంలో అగ్రరాజ్యాలకు కూడా సాధ్యం కాని ఎన్నో విజయాలను భారత్ అందుకుంది. చైనా, ఇటలీలో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకురావడంలో మన ప్రభుత్వం చేసిన కృషి ఎంతైనా అభినందనీయం. వైరస్ కట్టడి కోసం చేపట్టిన చర్యలు కూడా అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకున్నాయి.

ఈ వైరస్ బారినపడి బాధపడుతున్న దేశాలకు కూడా భారత్ ఆపన్న హస్తం అందించింది. ముఖ్యంగా ఇటలీకి మాస్కులు, దుస్తులు పంపించి మానవత్వాన్ని చాటుకుంది. అలాగే ఇరాన్‌తో పాటు పలు దేశాలకు వైద్య సహకారం అందించింది. ముఖ్యంగా సార్క్ దేశాలను భారత ప్రభుత్వం అప్రమత్తం చేసింది. పాకిస్థాన్‌తో శత్రుత్వాన్ని పక్కనపెట్టి ఈ వైరస్ పై పోరాటంలో ఆ దేశాన్ని కూడా కలుపుతుంది. మన కంటే పేద దేశాలు అయిన నేపాల్, శ్రీలంక, భూటాన్, మయన్మార్, మాల్దీవులు, బంగ్లాదేశ్ వంటి దేశాలతో సమన్వయం చేసుకుంటూ వైరస్ వ్యాప్తి చెందకుండా పెద్దన్న పాత్ర పోషించింది.

ఈ మహమ్మారిపై పోరాటంలో భారత ప్రభుత్వం చేస్తున్న పోరాటం ఇతర దేశాలకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఈ వైరస్ పుట్టుకకు నువ్వంటే నువ్వంటూ చైనా, అమెరికాలు గొడవ పెట్టుకున్నప్పటికీ భారత్ మాత్రం అలాంటివాటి జోలికి పోకుండా, ఎవరినీ నిందించకుండా... ప్రస్తుతం ఆ వైరస్‌ను అరికట్టే ప్రయత్నాలకు మాత్రమే శ్రీకారం చుట్టి పోరాడుతుండడం విశేషం!

ఇదే స్ఫూర్తితో భారత జాతి కరోనావైరస్‌పై సుదీర్ఘపోరాటానికి శ్రీకారం చుట్టింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ 21రోజుల పాటు లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చాడు. భవిష్యత్ భద్రంగా వుండాలంటే మనము ఈరోజు కొన్ని సమస్యలను ఎదుర్కోవాలి... ఇబ్బందులను భరించాలి. ఇవన్నీ ఓర్చుకుంటేనే రేపు మనదవుతుంది. ఈ స్ఫూర్తి కొరవడే... ఇటలీ, ఇరాన్ వంటి దేశాలు అల్లకల్లోల పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. మన దేశంలో ఆ పరిస్థితులు రాకూడదనుకుంటే ప్రధాని నరేంద్రమోడీకి మనమంతా మద్దతుగా నివాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఇది 'కరోనా' నామ సంవత్సర ఉగాది



రాష్ట్ర ప్రజలు ఇలాంటి ఉగాది పండుగను ఎప్పుడూ చూసి ఉండరు. తెలుగు ప్రజలకు ఎంతో ప్రత్యేకమైన పండుగ ఉగాది. ముందురోజే మార్కెట్లు కిటకిటలాడేవి. పూలు, పండ్లు, నిత్యవసర వస్తువులు వంటివి పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసేవాళ్ళు. అయితే కరోనా వైరస్ ప్రభావంతో ఈ ఉగాది చడీచప్పుడు లేకుండా జరిగిపోయింది. ఎక్కడా అలంకారాలు లేవు, దేవాలయాలు తెరవలేదు, ప్రత్యేక పూజలు లేవు, భక్తుల క్యూలు లేవు, ఉత్సవాలు లేవు, ఉగాది కవిసమ్మేళనాలు లేవు, ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలు లేవు, పంచాంగ శ్రవణాలు లేవు... అంతా ఇళ్లలోనే.. అందరూ ఇళ్లలోనే! శార్వరి నామ సంవత్సరం ఆరంభం చాలా విషాదంతో.. ఒక రకమైన నిశ్శబ్ద వాతావరణంతో మొదలైంది. ఇలాంటి ఉగాదిని తెలుగు ప్రజలు ఎప్పుడూ జరుపుకుని ఉండరు.

# కావలిలో ఇంటింటికీ కూరగాయలు

**- ఎమ్మెల్యే రామిరెడ్డి**



కావలి పట్టణంలో ఇంటింటికి కూరగాయలు, నిత్యావసర వస్తువులు అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ వెల్లడించారు. ఆర్డర్ల మేరకు నిత్యావసర సరుకులను ఇంటింటికి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. మొబైల్ వాహనాల ద్వారా కూరగాయలను అందిస్తున్నామని వెల్లడించారు. ఉదయం 6గంటల నుండి ఒంటి గంటవరకే కిరణా, పాలు, పండ్ల దుకాణాలు తెరచి ఉంచబడతాయన్నారు. కావలిలో ప్రజలకు 175 క్వింటాళ్ల కూరగాయలు అవసరం కాగా, 250 క్వింటాల్ల కూరగాయలను అందుబాటులో వుంచినట్లు చెప్పారు. కరోనా వైరస్‌ను తరిమికొట్టేందుకు 21రోజుల పాటు ప్రజలు నిష్టగా లాక్‌డౌన్‌కు బద్దులై వుండాలని వారు పిలుపునిచ్చారు.




# ప్రధాని పిలుపు పని చేసింది

కరోనా వైరస్ నివారణ కోసం ఒక్కరోజు జనతా కర్ఫ్యూను పాటించాలంటూ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు అద్భుతంగా పనిచేసింది. ప్రజలంతా మోడీ పిలుపుకు స్వచ్ఛందంగా స్పందించారు. ఈనెల 22వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించిన జనతా కర్ఫ్యూ దేశ చరిత్రలోనే ఒక అద్భుతంగా నిలిచిపోతుంది. 130 కోట్ల మంది ప్రజలు ఒకే తాటిపైకి వచ్చి వైరస్‌కు వ్యతిరేకంగా చేసిన ఈ ఉద్యమం భవిష్యత్తులో ఎలాంటి సవాళ్ళనైనా ఎదుర్కోవడానికి పునాదిగా నిలుస్తుంది. ముఖ్యంగా కరోనా వైరస్ ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది, పోలీసులు, పారిశుద్ధ్య సిబ్బంది అందిస్తున్న సేవలకు ప్రజలందరూ అభినందనలు తెలిపిన తీరు ఎంతో స్ఫూర్తిదాయకం.

**రియల్ మహేష్, నెల్లూరు.**

# నిర్లక్ష్యం చేస్తే మూల్యం తప్పదు

కరోనా వైరస్‌ను నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇటలీ దేశాన్ని చూస్తే ఈ విషయం ఇట్టే అర్థమవుతుంది. సాక్షాత్తు ఆ దేశ అధ్యక్షుడు అక్కడి పరిస్థితులను అదుపు చేయలేక కంటతడి పెట్టుకున్నాడు. వాళ్లు చేసుకున్న నిర్లక్ష్యం ఈరోజు ఆ దేశాన్ని నాశనం చేస్తోంది. కొన్ని వేలమంది ఈ వైరస్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. మనం కూడా జాగ్రత్తగా ఉందాం. నిర్లక్ష్యం వీడి, ప్రభుత్వ సూచనలు పాటించి వైరస్‌ను అరికట్టడానికి మనవంతు సహకారం అందిద్దాం.

**రేపల్లె నారాయణ, దేవిపేట.**

# ఎన్నారైలు బాధ్యతగా ప్రవర్తించాలి

కరోనా వైరస్ ప్రపంచాన్ని వణికిస్తున్న నేటి పరిస్థితుల్లో విదేశాల నుంచి వచ్చిన కొందరు చదువుకున్నవారు వ్యవహరిస్తున్న తీరు బాధాకరంగా ఉంటోంది. దేశం పట్ల ఏ మాత్రం బాధ్యత లేనట్లుగా ప్రవర్తిస్తున్నారు. భారతదేశంలో వ్యాప్తికి కారణం విదేశాల నుంచి వచ్చిన వాళ్లే. అక్కడి నుంచి వచ్చాక కొద్దిరోజుల పాటు తమ ఇళ్లలోనే ఉంటే ఈ వైరస్ వ్యాపించేది కాదు. కానీ వీళ్ళు అలా ఉండకపోవడంతో ఇతరులకు ఈ వైరస్ వ్యాపించడం జరిగింది. ఈరోజు దేశమంతా కూడా లాక్‌డౌన్ ప్రకటించింది. దేశానికి కొన్ని వేలకోట్ల నష్టం సంభవిస్తోంది. విదేశాల నుండి వచ్చిన వారు ఏ మాత్రం బాధ్యతగా వ్యవహరించి ఉన్నా ఇంత నష్టం జరిగేది కాదు.

**కాకోలు సూర్యనారాయణ, నెల్లూరు.**

# బ్రతుకుబండి 'లాక్'



*"బతికుంటే బలుసాకు తిని బతకొచ్చు" అనే ఒక సామెత ఉంది. ఇప్పుడు కరోనా వైరస్ దెబ్బకు అందరి పరిస్థితి అలాగే తయారైంది. వ్యాపారాలు పోతే పోయాయి, ఈ వైరస్ వచ్చిందంటే ప్రాణాలు పోతాయి... దానికంటే గంజి నీళ్లయినా తాగి ఇంటిపట్టునే ఉందామనే భావన ప్రజల్లో వచ్చేసింది.*

కరోనా ప్రభావంతో జిల్లాలో వ్యాపార వాణిజ్య సంస్థలన్ని స్తంభించిపోయాయి. గత వారం రోజులుగా సినిమా హాల్స్, మాల్స్‌ను మూసివేశారు. హోటల్స్ మూతపడ్డాయి. పాఠశాలలు మూతపడ్డాయి, మార్కెట్లు మూత వేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే హాస్పిటల్స్, మందుల షాపులు, నిత్యావసర వస్తువుల దుకాణాలు తప్పితే ఇంకేమీ తెరవడం లేదు. రైళ్ళు నిలిచి పోయాయి, బస్సులు ఆగిపోయాయి, కార్లు, ఆటోలు బంద య్యాయి. రోజుకి కోట్ల రూపాయలలో ఆస్తి నష్టం సంభవిస్తోంది. వ్యాపారులు తమ దుకాణాలు మూసివేసి ఇంటిపట్టునే ఉం టున్నారు. ఆటోలు నడుపుతున్న కొన్ని వేలమంది కార్మికులు ఇళ్ళకే పరిమితమయ్యారు. టాక్సీవాలాలకు ఉపాధి లేకుండా పోయింది. ముఖ్యంగా టిఫిన్ బండ్లు, టీ షాప్‌లు, బడ్డీ కొట్లు నడుపుకొని బతికే వాళ్ళు ఈ కరోనాపై సమరంలో పాత్ర దారులు కావడం గమనార్హం.

వ్యాపార వాణిజ్య సంస్థలను మూతపడటం వల్ల రోజువారి వేతనాలపై వెళ్లి బ్రతుకు బండిని నడిపే వేలాది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా కూడా కరోనాపై సాగించే సమరంలో వాళ్లంతా కూడా తమ సహకారం అందిస్తున్నారు.





# అధికారులు అదుర్స్




*ఆంధ్రప్రదేశ్‌లోని మొట్టమొదటి కరోనా వైరస్ కేసు నెల్లూరు జిల్లాలో నమోదు కావడం తెలిసిందే! అయితే వైరస్ నమోదు కాకముందే దీనిని ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైన తీరు అభినందనీయం. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు చొరవను, ముందుచూపును కొనియాడాలి.*

వైరస్ జిల్లాలోకి ప్రవేశించేముందే ఆయన అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ముందుగానే ఐసోలేషన్ వార్డును సిద్ధం చేశారు. కరోనా వైరస్ వ్యాపించకుండా ప్రజలలో అవగాహన కల్పించడం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. కరోనా వైరస్ కేసు వెలుగులోకి వచ్చాక జిల్లా అంతటా అలర్ట్ ప్రకటించారు. ముఖ్యంగా బాధితుడు ఉన్నటువంటి చిన్నబజారు ప్రాంతంలో అప్రమత్తం చేశారు. శానిటేషన్ ముమ్మరం చేశారు. వైరస్ బాధితుడు ఎక్కడెక్కడ తిరిగాడు, అతని మూలంగా ఇంకెవరికైనా వైరస్ సోకిందా అనే కోణంలో లోతుగా విచారణ జరిపించి అనుమానితులను ఆసుపత్రులకు తీసుకు వచ్చి వైద్య పరీక్షలు జరిపించారు. వైరస్ బయటపడగానే శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి రథోత్సవం కూడా పరిమితం చేశారు. ముఖ్యంగా జనం గుమికూడే ప్రాంతాలపై దృష్టి సారించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు నేపథ్యంలో జనతా కర్ఫ్యూను, లాక్‌డౌన్‌లను అమలు చేయడంలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ ఎంతో చొరవతో పని చేశారు. ప్రతిరోజూ జిల్లాలో కేసులపై సమీక్ష జరిపారు. జిల్లాకు వస్తున్న వారిపై నిఘా పెట్టారు. అనుక్షణం ఎక్కడెక్కడ అనుమానిత కేసులు ఉన్నాయి అనేదానిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇక కరోనా వైరస్ వణికిస్తున్న తరుణంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పోలీసు యంత్రాంగం, పారిశు ద్ధ్య కార్మికులు, మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది, అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది అందించిన సేవలు నిరుపమానం.

# మందుబాబులకు ఎన్ని కష్టాలో!

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి మందు బాబులకు కష్టాలు మొదలయ్యాయి. ఓ పక్క ప్రభుత్వంతోపాటు ఇంకోపక్క ప్రకృతి పరిస్థితులు కూడా వీటికి తోడయ్యాయి.

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోటే ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి మద్యం తాగే వాళ్ళపై పగబట్టినట్లుగా వ్యవహరిస్తున్నాడు. మద్యం నియంత్రణలో భాగంగా వైన్‌షాపులు బాగా తగ్గించేశాడు, బెల్టుషాపులు మూయించాడు. గ్రామాలలో మద్యం అందుబాటులో లేకుండా చేశాడు. మద్యం షాపు లను ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకురావడమే కాకుండా ప్రభుత్వ కార్యాలయాల మాదిరిగానే వాటికి కూడా నిర్ణీత వేళలు నిర్ణయిం చాడు. ఎమ్మార్వో ఆఫీస్‌లు టైంకు తెరిచినట్లుగా, మూసేసినట్లుగా మద్యం షాపులు కూడా టైం టూ టైం నిర్వహిస్తున్నారు. రాత్రి 8గంటలు దాటిందంటే మద్యం దొరకడం గగనంగా మారింది. దీనికితోడు అడిగినంత మద్యం ఇవ్వడంలేదు. ఇంకోపక్క మద్యం షాపులలో కావాల్సిన బ్రాండ్ కూడా దొరకడం లేదు. ఇది కూడా చాలదన్నట్లు గతం కంటే మద్యం రేట్లను పెంచడం మందుబాబులకు గుదిబండగా మారింది.



ఇప్పుడు ఈ కష్టాలన్నిటికీ తోడుగా కరోనా వైరస్ ప్రభావంతో మద్యం షాపులను మూసి వేయడం జరిగింది. మొన్న ఆదివారం ఒక్కరోజే కర్ఫ్యూ అనుకొని మందుబాబులు జాగ్రత్త పడలేదు. వారం పది రోజులకు సరిపడా మద్యం సీసాలు కొనుగోలు చేయలేదు. తీరా చూస్తే ఇప్పట్లో కర్ఫ్యూ ఎత్తేసే పరిస్థితులు కనిపించడం లేదు. ఏప్రిల్ 14 దాకా కర్ఫ్యూ కొనసాగించే అవకాశా లున్నాయి. ఒకవేళ దేశవ్యాప్తంగా అప్పటికీ పరిస్థితులు అదుపులోకి రాకపోతే లాక్‌డౌన్‌ను కొనసాగించే అవకాశాలున్నాయి. ఇన్ని రోజులు మందు కడుపులోకి పోకుండా ఉండాలంటే మందుబాబులకు కష్టమే. ఇప్పటికే తెలిసినవాళ్లని, బంధువులను, మిత్రులను మద్యం కోసం వాకబు చేస్తున్నట్లు తెలుస్తోంది.



# తొలి కేసు డిశ్చార్జ్

## కరోనాపై నెల్లూరు అధికార యంత్రాంగం విజయం

*ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన తొలి కరోనా వైరస్(కోవిడ్-19) కేసుకు సంబంధించి బాధితుడు పూర్తిగా కోలుకున్నాడు. 15 రోజుల పాటు ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందిన బాధితుడు సంపూర్ణ ఆరోగ్యవంతునిగా ఈ నెల 23వ తేదీ రాత్రి డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళ్లిపోయాడు.*

నెల్లూరు చిన్నబజార్‌కు చెందిన ఓ యువకుడు చదువునిమిత్తం ఇటలీలో ఉంటు న్నాడు. ఇటలీలో కరోనా వైరస్ వ్యాప్తి అధికంగా ఉండటంతో అక్కడి కళాశాల యాజమాన్యం విద్యార్థులను వారి వారి స్వస్థలాలకు పంపించేసింది. ఈ క్రమంలో నెల్లూరు యువకుడు కూడా ఈ నెల 7వ తేదీన విమానంలో చెన్నై చేరుకుని అక్కడి నుండి తన వాహనంలో నెల్లూరుకి చేరుకున్నాడు. చెన్నై ఎయిర్‌పోర్టులో సిబ్బంది సాధారణ పరీక్షలు చేయగా ఎలాంటి వైరస్ లక్షణాలు కనిపించలేదు. ఇంటికొచ్చిన రెండవరోజు నుండి అతనికి జ్వరం, దగ్గు, జలుబుతో పాటూ ఊపిరి తీసుకోవడం కష్టంగా మారింది.

దీంతో ఆ యువకుడు ఈనెల 9వ తేదీన నెల్లూరులోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు వెళ్ళాడు. అప్పటికే అక్కడ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసివుండడంతో ఆ యువకుడ్ని వార్డులో ఉంచి చికిత్స అందజేశారు. ఆయన నమూనాలను తిరుపతిలోని స్విమ్స్‌కు పంపగా కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. పూర్తిస్థాయి నిర్ధారణ కోసం పూణేకు పంపగా అక్కడ కూడా పాజిటివ్‌గా వచ్చింది. ఈ కరోనా కేసు రాష్ట్రంలో తొలి పాజిటివ్ కేసుగా నమోదైంది. దీంతో జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు ప్రత్యేకచర్యలు చేపట్టారు. ఆ యువకుడిని అప్పటినుండి ఐసోలేషన్ వార్డులోనే ఉంచి వైద్య చికిత్స అందజేశారు. వారం క్రితం పూర్తిగా కోలుకున్నాడు. మరో రెండు దఫాలుగా ఆ యువకుడి నమూనాలను పూణేకు పంపగా రెండుసార్లు నెగటివ్‌గా రిపోర్ట్ వచ్చింది. దీంతో వైద్యాధికారులు సోమవారం రాత్రి ఆ యువకుడిని హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ చేశారు. మరో 14 రోజుల పాటు బయటకు రాకుండా హోమ్ ఐసోలేషన్‌లో ఉం డాలని యువకుడికి సూచించారు. కరోనా వైరస్ బారినపడిన యువకుడు పూర్తిగా కోలుకోవడంతో జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

రాష్ట్రంలో నమోదైన తొలి కరోనా కేసు ఇది కావడం, ఈ బాధితుడికి అందించిన చికిత్స విజయవంతమై కోలుకోవడం పట్ల అధికారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసు తప్ప జిల్లాలో రెండో పాజిటివ్ కేసు లేకపోవడం విశేషం. ముఖ్యంగా ఈ యువకుడి నుండి కరోనా వైరస్ ఇంకెవరికీ వ్యాపించకుండా ఉండడం ఎంతో ఆనందించాల్సిన విషయం!

# నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు

ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా లాక్‌డౌన్ అధిగమించి రోడ్ల మీద ఇష్టా రాజ్యంగా తిరుగుతున్న 62 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. జిల్లా ఉప రవాణా అధికారి సుబ్బారావు ఆదేశాల మేరకు ఎన్‌విఐలు బాలకృష్ణ, సుధాకర్ రెడ్డి, మాధవరావు, అనిల్, మధుసూదన రావులు ఆయా సెంటర్లలో కాపుకాసి నిబంధనలను అతిక్రమించి రోడ్డు మీద తిరుగుతున్న వారిపై కేసులు నమోదు చేయడం జరిగింది.







నెల్లూరు కబుర్లు

### 144 సెక్షన్‌ను పరిశీలించిన

## జిల్లా కలెక్టర్, ఎస్పీ



తప్పనిసరి అయితే తప్ప ప్రజలెవ్వరూ ఇల్లు విడిచి బయటకు రావద్దని అలా చేయడం వల్ల కరోనా వైరస్‌ను నిర్మూలించ వచ్చునని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎమ్.వి.శేషగిరిబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ తో కలిసి నెల్లూరు నగరంలో 144 సెక్షన్‌ను పరిశీలించారు. వీఆర్సీ సెంటర్, ఆత్మకూరు బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పలు సూచనలు చేశారు. అలాగే వీఆర్సీ మైదానాన్ని కూడా పరిశీలించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలకు నిత్యావసర వస్తువులైన కూరగాయలు సాధారణ ధరలకే అందించేందుకు మార్కెటింగ్ శాఖ పలుచోట్ల కూరగాయల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. వీఆర్సీ మైదానంలో కూడా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. అందులో భాగంగా ఆ మైదానాన్ని పరిశీలించారు.

## ఉగాది దీక్ష పాటిద్దాం



- సోమిరెడ్డి

కరోనా వైరస్ భారత దేశాన్ని వణికిస్తున్న తరుణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు నిచ్చిన మేరకు లాక్ డౌన్‌ను ఉగాది దీక్షగా చేపట్టి విజయవంతం చేద్దామని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా ప్రజలకు ఆయన ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ తన సందేశంలో ప్రజలు అయ్యప్ప దీక్షను, రంజాన్ ఉపవాసాలను ఎంత భక్తిగా అమలు చేస్తారో లాక్ డౌన్‌ను కూడా అంతే దీక్షతో అమలు చేయాలన్నారు.

ఈ కష్ట కాలంలో పేదలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి ధర్మమని, ఎవరు కూడా తమ వద్ద పని చేసే వారిని పనుల్లో నుండి తీసేయొద్దని, వారికి సకాలంలో జీతాలు ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు. కరోనా వైరస్ మహమ్మారి విజృంభిస్తున్న తరుణంలో కూడా తమ ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది, పోలీసులకు, జర్నలిస్టులకు, అన్ని ప్రభుత్వ విభాగాల సిబ్బందికి సోమిరెడ్డి అభినందనలు తెలిపారు.

## వీఎస్‌యు పాలకమండలి

వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంకు పాలకమండలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు డాక్టర్ సుజానాయక్, డాక్టర్ విజయలక్ష్మి, కావలి పీజీ సెంటర్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరావు, నెల్లూరు డీకేడబ్ల్యు కళాశాల అధ్యాపకురాలు పద్మజ, గూడూరు డిఆర్‌డబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ భారతి లక్ష్మి, జాప్‌కామ్ గ్రూప్ సీఈవో పల్లంరెడ్డి కిషోర్‌రెడ్డి, కృష్ణచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ కృష్ణారెడ్డి, విఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రొప్రైటర్ శ్రీనివాసకుమార్, యాక్సెంచర్ టీం లీడర్ సుజని కోటిరెడ్డిలను సభ్యులుగా నియమించారు.

### రాజమోహన్‌రెడ్డిని

## గుర్తుకు తెచ్చుకుంటున్నారు



కరోనా వైరస్ ఎఫెక్ట్‌తో ప్రజలంతా పరిశుభ్రతపై దృష్టి పెట్టారు. రోజుకు ఒకసారి కూడా చేతులు కడగని వాళ్ళు... ఇప్పుడు గంటకొకసారి కడుక్కుంటున్నారు. ఇంతకుముందు మనిషి ఎదురువడితే టక్కున చేయిచాచి షేక్‌హ్యాండ్ ఇచ్చేవాళ్ళు, అది పెద్ద సంస్కారంగా భావించేవాళ్ళు. ఇప్పుడు కరోనా దెబ్బకు షేక్‌హ్యాండ్ ఇచ్చేవాళ్ళు కరువయ్యారు. పద్ధతిగా రెండు చేతులెత్తి నమస్కారం చేస్తూ.. ఉత్తమ సంస్కారం చాటుకుంటున్నారు.

ఈ కరోనా కష్టకాలంలో ఇప్పుడు అందరికీ మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి గుర్తుకు వస్తున్నాడు. ఆయనకు షేక్‌హ్యాండ్ ఇచ్చే అలవాటు లేదు, ఒకవేళ ఇచ్చినా అప్పటికప్పుడు చేతిని కడుక్కోవడం లేదా తుడుచుకోవడం చేసేవాడు. ముఖ్యంగా ఎన్నికల సమయాలలో ఆయన పై ఈ ప్రచారం ఎక్కువగా ఉండేది. ఆయన పట్ల కొంత వ్యతిరేక భావం కూడా దీని మూలంగా వచ్చింది. షేక్‌హ్యాండ్ ఇస్తే చేయి కడుక్కుంటాడనే పేరు ఆయనకు ఉండేది. అయితే ఇప్పుడు ఆయన అప్పుడు అలా ఎందుకు చేశాడన్నది అర్థమవుతుంది. ఇప్పుడు అంతా కూడా మేకపాటి రాజమోహన్‌రెడ్డి పద్ధతే కరెక్ట్ అంటున్నారు.

### నిత్యావసరాలకు..

## లోటు లేదు



- జె సి వినోద్‌కుమార్

లాక్‌డౌన్ పరిస్థితుల్లో ప్రజలు నిత్యావసర వస్తువుల కోసం ఇబ్బంది పడాల్సిన పని లేదని, అన్ని రకాల నిత్యావసర వస్తువులు ప్రజలకు అందుబాటులో ఉంటాయని జిల్లా జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈనెల 24వ తేదీన నెల్లూరు జడ్పీ సమావేశ మందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిత్యావసర సరుకులు, కూరగాయలు, గ్యాస్, పాలు, పెట్రోల్, మెడికల్ షాప్‌లు ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. చికెన్, మటన్ షాప్, మందుల షాపులు, పాల కేంద్రాలు, పెట్రోల్ బంకులు, కూరగాయల మార్కెట్లు ఎప్పుడూ పనిచేస్తాయని, వీటిని సరఫరా చేసే రవాణా వాహనాలపై ఎలాంటి ఆంక్షలు లేవని ఆయన వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 27 ప్రాంతాలలో నిత్యావసర వస్తువులు అందజేసే కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సోషల్ మీడియాలో కరోనా వైరస్‌పై అసత్యాలు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## వాలంటీర్ సేవలకు దరఖాస్తు

నెల్లూరుజిల్లా వ్యాప్తంగా మెడికల్ విభాగంలో వాలంటీర్‌గా సేవలందించడానికి నిపుణులైన వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, నాన్ మెడికల్ సిబ్బంది, ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు అవసరమని జిల్లా కలెక్టర్ యం.వి.శేషగిరి బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెడికల్ వాలంటీర్‌గా విధులు నిర్వర్తించడానికి ముందుకు వచ్చే వాలంటీర్‌లు www.spsnellore.ap.gov.in వెబ్ సైట్లో పేర్లు నమోదు చేసుకోవలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి, వారు కోరుకున్న మండలంలో విధులు కేటాయించబడతాయని కలెక్టర్ శేషగిరిబాబు ఆ ప్రకటనలో తెలిపారు.

# మందుల అదనపు ఉత్పత్తికి పర్యావరణ అనుమతులు



- వై.వి.రామిరెడ్డి

ప్రపంచవ్యాప్తంగా ప్రబలిన కరోనా వైరస్ భారతదేశంలో కూడా ప్రభావం చూపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ఫార్మా కంపెనీలకు ప్రస్తుతం ఉత్పత్తి చేసిన దానికంటే అదనంగా ఔషధాలను ఉత్పత్తి చేసేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ అనుమతులు ఇచ్చిందని కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ సభ్యులు వై.వి.రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు విడుదల చేయడం జరిగిందన్నారు. అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి త్వరిత గతిన ఔషధాల కంపెనీలకు వెంటనే అనుమతులు జారీ చేసి ఔషధాల ఉత్పత్తి భారీగా పెంచేందుకు దోహదపడాలని అన్నారు. సాధారణ జ్వరం జలుబు దగ్గు మరియు జీర్ణకోశ వ్యాధులకు సంబంధించిన వ్యాధులకు వాడే పారాసిటమాల్, సిట్రజిన్, పాంటాప్రజోల్, క్లోరోక్విన్ మొదలైన ఔషధాల ఉత్పత్తిలో భారతదేశం 30 శాతం వాటాను కలిగి ఉందని, యూరప్, ఆసియా దేశాలకు భారతదేశం నుండి మందుల సరఫరా జరుగుతుందని ఆయన వెల్లడించారు. భారతదేశంలో ఔషధ కర్మాగారాలకు నిధుల కొరత లేకుండా ప్రత్యేక గ్రాంట్ కింద 14 వేల కోట్ల నిధులను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ చర్యలు తీసుకున్నారని, ఇది ఎంతైనా అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

### పాతికేళ్ల తర్వాత..

## కర్ఫ్యూ వాతావరణం



1996లో బాబ్రీ మసీదు కూల్చివేత సమయంలో నెల్లూరు నగరంలో కర్ఫ్యూ పెట్టారు. అప్పట్లో కొన్ని రోజుల పాటు ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటికి రాలేదు. దాదాపు పాతికేళ్ళ తర్వాత కరోనా వైరస్ నేపథ్యంలో నెల్లూరు నగరంలో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. అయితే అప్పటి పరిస్థితి వేరు ఇప్పుడున్న పరిస్థితి వేరు. ఇది జనం కోసం, దేశం కోసం విధించుకున్న కర్ఫ్యూ కాబట్టి ప్రజలు కూడా ఈ కర్ఫ్యూకు సహకరిస్తున్నారు.

### బోసిపోయిన

## నెల్లూరు రైల్వే స్టేషన్



నిత్యం వేలాది మంది ప్రయాణికులతో, వందలాది రైళ్ళ రాకపోకలతో రద్దీగా ఉండే నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ బోసిపోయింది. లాక్‌డౌన్‌తో రైళ్ల రాకపోకలు ఆగిపోవడం తెలిసిందే! దీంతో రైల్వేస్టేషన్లో రైల్వే పోలీసులు, సిబ్బంది తప్పితే ఎవరూ లేక స్టేషన్ మొత్తం నిర్మానుష్యంగా మారింది.

## 29న రేషన్ పంపిణీ

కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా ఏప్రిల్ నెలకు సంబంధించిన రేషన్‌ను ఈ నెల 29వ తేదీన పంపిణీ చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువులతో పాటు కేజీ కంది పప్పు, అలాగే ప్రతి కుటుంబానికి వెయ్యి రూపాయల నగదు అందజేయనున్నారు. గ్రామ స్థాయిలో వాలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయనున్నారు.

## పదికి కరోనా ఎఫెక్ట్

ఈ ఏడాదికి పదోతరగతి పరీక్షలు ఒక చరిత్రగా మిగిలిపోనున్నాయి. ఏ సంవత్సరం విద్యార్థులు కూడా ఇటువంటి సవాళ్లను ఎదుర్కొని ఉండరు.

ఈ ఏడాది పరీక్షాపత్రం మారడం ఒక ఎత్తయితే మార్చి 23వ తేదీ నుండి మొదలు కావాల్సిన పదో తరగతి పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల కారణంగా వాయిదా వేయడం తెలిసిందే! ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మార్చి 31 నుండి మొదలు కావాల్సి ఉంది. అయితే కరోనా వైరస్ ప్రభావంతో స్థానిక ఎన్నికలు వాయిదా పడగా, ఈ ఎన్నికల మూలంగా 31వ తేదీకి వాయిదా పడ్డ పదో తరగతి పరీక్షలను ఇంకోసారి వాయిదా వేయాల్సి వచ్చింది. పదో తరగతి పరీక్షలను రెండు వారాల పాటు వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ఆదిమూలం సురేష్ ప్రకటించారు. ఏప్రిల్ మొదటి వారంలో కరోనా ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని అప్పటి పరిస్థితులను బట్టి ఈ పరీక్షల తేదీ నిర్ణయించే అవకాశం ఉంది. ప్రభావం ఇంకా తీవ్రమైతే పరీక్షలు ఎప్పుడు ఉంటాయో చెప్పలేని పరిస్థితి. మొత్తానికి ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇవన్నీ ఒక చేదు జ్ఞాపకాలే!

### అధిక ధరలకు విక్రయిస్తే...

## కఠిన చర్యలు తప్పవు

- నెల్లూరు ఏఎంసీ చైర్మన్ ఏసు నాయుడు



నెల్లూరు ఏసీ కూరగాయల మార్కెట్‌ను నెల్లూరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏసునాయుడు మంగళవారం తనిఖీ చేశారు. మార్కెట్ కమిటీ నిర్ణయించిన ధరలకే వినియోగదారులకి కూరగాయలు విక్రయించాలని, అధిక ధరలకు అమ్మాలని ఎవరైనా ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన పలు దుకాణాల వద్దకు వెళ్లి వినియోగదారులను అడిగి ధరలను ఆరా తీశారు. ప్రతి దుకాణం వద్దకు వెళ్ళి అక్కడ ఉన్న తూకాలు, కాటాలను పరిశీలించారు. అదేవిధంగా వినియోగదారులు ఎవరైనా అధిక ధరలు అమ్ముతున్నారని తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నెల్లూరు ఏఎంసి చైర్మన్ ఏసునాయుడుతో పాటు పలువురు జర్నలిస్టు మిత్రులు కూడా కూరగాయల మార్కెట్‌లో పర్యటించారు. ప్రస్తుతానికి కూరగాయల ధరలు మామూలుగానే ఉన్నాయి... మిగిలిన రోజుల కంటే ఐదు రూపాయలు అటు ఇటుగా ఉన్నాయి. కాకపోతే పరిస్థితిని అవకాశంగా తీసుకుని రేట్లు పెంచకుండా చూడాలి!

# కరోనా ఉద్యమానికి 3 నెలల జీతం

- మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్



కరోనా వైరస్ నిర్మూలన కోసం జరుగుతున్న ఉద్యమానికి తన 3నెలల జీతాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రకటించారు. తనతో పాటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూడా ఒక నెల జీతాన్ని సీఎం సహాయ నిధికి ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ నెల 25న ఆయన నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలోని ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌లో కరోనా వైరస్ నివారణ చర్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు, జాయింట్ కలెక్టట్ వినోద్ కుమార్, ఎస్పీ భాస్కర్ భూషణ్, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమీక్ష అనంతరం మంత్రి అనిల్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ విదేశాల నుండి మన రాష్ట్రానికి వచ్చిన వారిలో 95 శాతం మందిని గుర్తించి వారిని హోమ్ ఐసోలేషన్‌లో వుంచి పరిశీలిస్తున్నామని చెప్పారు. వైరస్ నిర్మూలనకు ఏపీలో తీసుకున్నంత జాగ్రత్తలు మరే రాష్ట్రంలో తీసుకోవడం లేదని అన్నారు. పోలీసు, వాలంటీర్లు కలిపి మొత్తం 25 వేల మంది కరోనా మహమ్మారిని అడ్డుకునేందుకు కృషి చేస్తున్నారని, వారికి జర్నలిస్టులు సహకరిస్తున్నారని అభినందించారు.

జిల్లాకు 5లక్షల మాస్కులు అవసరమని, రెండు రోజుల్లో వాటిని సమకూరుస్తామని మంత్రి వెల్లడించారు. జిల్లాలో 1584 మంది విదేశాల నుండి వచ్చిన వారు ఉన్నారని, వారందరిని హోమ్ ఐసోలేషన్‌లో ఉంచి పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. బాడీ టెంపరేచర్ పరీక్షించే థర్మల్ గన్స్ 50 అవసరమని జిల్లా కలెక్టర్ చెప్పారని వాటిని శుక్రవారం కల్లా సమకూరుస్తామని తెలిపారు. కరోనా వైరస్‌ను పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ సామాజిక దూరాన్ని పాటించాలని మంత్రి పేర్కొన్నాడు.




# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

**- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సంక్షేమపథకాలు వెల్లువెత్తుతున్నాయని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైఎస్సార్సీపి నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 20న వాకాడులోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వ హయాంలోనూ ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా వైయస్సార్సీపి పాలనలో పేదలకు పూర్తిస్థాయిలో సంక్షేమ ఫలాలను అందజేస్తున్నామని, గత ప్రభుత్వ హయాంలో టిడిపి నాయకులు, కార్యకర్తలకే సంక్షేమ పథకాలు కట్టబెట్టారని, వైఎస్సార్సీపి ప్రభుత్వం అందుకు భిన్నంగా పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను ఇళ్ళవద్దకే అందజేస్తోందన్నారు. పేదలు నివేశన స్థలాల కోసం ఒక్క రూపాయి కూడా చెల్లించనక్కరలేదని, అర్హులైన వారందరికీ ఇళ్ళ పట్టాలు అందుతాయని చెప్పారు. తొలుత నాయకులు ఎంబేటి యాదగిరి తదితరులు రామ్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. పార్టీ నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, పాపారెడ్డి మనోజ్ కుమార్‌రెడ్డి, సన్నారెడ్డి చంద్రభూషణ్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, వేమారెడ్డి సునీల్‌రెడ్డి, దువ్వూరు భాస్కర్‌రెడ్డి, కాటంరెడ్డి రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఎంఎస్ఆర్ సేవాసమితి ఆపన్న హస్తం



ఇండియా లాక్‌డౌన్ నేపథ్యంలో నెల్లూరులోని ఎంఎస్ఆర్ సేవాసమితి తమ సేవానిరతిని చాటుకుంది. ఆహారం లేక అల్లాడుతున్న పేదలకు ఆహారం పొట్లాలను అందించింది. ఈ సందర్భంగా ఎంఎస్ఆర్ సేవాసమితి అధ్యక్షుడు మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందు) మాట్లాడుతూ లాక్‌డౌన్ ప్రభావంతో వీధుల్లో జన సంచారం కరువైపోయిందని, దీంతో వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయని, పట్టెడు అన్నం దొరకక ఆకలితో అలమటిస్తున్నవారి పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పలువురు అనాథలు, అభాగ్యులు, యాచక వృత్తిపై ఆధారపడి జీవించేవారు, వృత్తి పనుల కోసం వచ్చిన కార్మికులు గత నాలుగు రోజులుగా ఎంతో దయనీయ పరిస్థితి ఎదుర్కొంటున్నారని, వారి కష్టాలను చూసిన ఎంఎస్ఆర్ సేవాసమితి ప్రతిరోజు వారికి ఆహార పొట్లాలను అందిస్తుందని తెలిపారు.

# శ్రీసిటీలో పకడ్బందీగా లాక్‌డౌన్!

**- శ్రీసిటీ డిఎస్పి బి.హెచ్ విమలకుమారి**



ప్రజారోగ్యం కోసమే లాక్‌డౌన్‌ను కఠినంగా అమలు చేస్తున్నామని శ్రీసిటీ డిఎస్పీ బి.హెచ్ విమలకుమారి అన్నారు. ఈ నెల 25న శ్రీసిటీలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కరోనా వైరస్ కట్టడికి ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. కరోనా నియంత్రణకు చాలా అప్రమత్తంగా ఉన్నామని, రాబోయే రోజుల్లో మరింత కఠినంగా వ్యవహరిస్తామని ఆమె పేర్కొన్నారు. కొంతమంది పరిస్థితులను అర్థం చేసుకోకుండా పోలీసులను ప్రశ్నిస్తున్నారన్నారు. ప్రజల భద్రత కోసమే పోలీసులు పనిచేస్తున్నారని తెలిపారు. రాత్రి 8 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు రోడ్లపైకి అనుమతించమని పునరుద్ఘాటించారు.

శ్రీసిటీలో వివిధ పరిశ్రమలకు చెందిన చాలామంది మహిళా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని వారు రాష్ట్రం నలుమూలల నుండి వచ్చి, పొరుగున ఉన్న వరదయ్య పాలెంలో వివిధ విడిది గృహాలలో ఉంటున్నారని, 144సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో, చిత్తూరు జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్ ఆదేశాలతో, ఆ మహిళా ఉద్యోగులను వారి వారి స్వగ్రామాలకు పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

వారి ఆరోగ్యం గురించి ఏవిధమైన ఆందోళన పడాల్సిన అవసరం లేదని, అందరూ ఆరోగ్యంగానే ఉన్నారని, శ్రీ సిటీ లో ఇంతవరకు ఒక్క కరోనా పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదని ఆమె చెప్పారు . సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలు చూసి ప్రజలు ఆందోళన పడాల్సిన అవసరం లేదని ఎవరైనా అనవసరంగా లేనిపోని తప్పుడు సమాచారం సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీ సిటీ సరిహద్దు ప్రాంతంలో గట్టి పోలీసు పహారాఏర్పాటు చేశామన్నారు. పరిశ్రమలన్నీ లాక్‌డౌన్‌లో ఉన్నాయని ప్రజలందరూ దీన్ని గుర్తించాలని, పోలీసులకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# కరోనా కట్టడికి చర్యలు



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ తదితరులు

గూడూరు పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిని సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ తనిఖీ చేశారు. అక్కడి వైద్యాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం కరోనా వైరస్ వ్యాధి రోగుల కొరకు ఏర్పాటు చేసిన ప్రత్యేకవార్డును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో 24గంటలూ వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. కరోనా వైరస్ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. ఈ సమీక్షలో ఆసుపత్రి డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# అధిక ధరలకు అమ్మితే చర్యలు

నిత్యావసర వస్తువులను, కూరగాయలను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ ప్రత్యేకాధికారి జీవిఎస్ నాగలక్ష్మి తెలిపారు. గూడూరు పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను తనిఖీ చేసి, వ్యాపారులతో, విక్రయదారులతో ఆమె చర్చించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి మురళీకృష్ణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# మాస్కుల పంపిణీ

గూడూరు పట్టణంలోని మెప్మా, మై ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో మెప్మా సీవో హైమావతి ఇటీవల మాస్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాహుల్, రమేష్, ప్రమీల, ప్రతిమ పాల్గొన్నారు.



కోవిడ్ -19 ఫండ్ క్రింద రూ.50వేల చెక్కును ఇటీవల గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణకు అందజేస్తున్న ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ ఎస్.రామ్మోహన్‌రావు.



చప్పట్లు కొడుతున్న వైద్యులు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, రోహిణి తదితరులు

# చప్పట్లతో కృతజ్ఞతలు

కరోనాను అరికట్టేందుకు అందరూ ఇళ్ళలో ఉండగా ప్రజలకు సేవ చేసేందుకు బయటకు వచ్చిన వైద్య సిబ్బందికి, పోలీసులకు, పారిశుద్ధ్య కార్మికులకు గూడూరు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు ఈ నెల 22న సాయంత్రం 5గంటలకు తన కార్యాలయంలో సిబ్బందితో కలిసి చప్పట్లు కొట్టి కృతజ్ఞతలు తెలిపారు. కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు ప్రధాని పిలుపు మేరకు దేశ ప్రజలందరూ ఒక తాటిపైకి వచ్చి జనతా కర్ఫ్యూను పాటించారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజలతో పాటు కమిషనర్ తదితరులు అత్యవసర సమయంలో ప్రజలకు సేవలందిస్తున్న వివిధ వర్గాల వారికి చప్పట్లు కొట్టి కృతజ్ఞతలు తెలిపారు.

కాగా, కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు అహర్నిశలూ శ్రమిస్తున్న వైద్యులు, పారిశుద్ధ్య సిబ్బంది, పోలీసులకు పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, ఆయన సతీమణి డాక్టర్ సి.రోహిణి తమ కరతాళధ్వనులతో సంఘీభావం తెలిపారు. మోదీ, జగన్మోహన్‌రెడ్డిల పిలుపు మేరకు ఆదివారం జనతాకర్ఫ్యూ నిర్వహించిన విషయం తెలిసిందే! ఈమేరకు పట్టణంలోని సిఆర్ రెడ్డి ఆసుపత్రి ఆవరణంలో సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమానికి సహకరించిన వారందరికీ తమ కరతాళధ్వనులతో కృతజ్ఞతలు తెలిపారు.

# వైజేపీ లయన్స్ హోమియో పిల్స్



హోమియో పిల్స్‌ను ఇస్తున్న వైజేపీ లయన్స్ సభ్యులు

కరోనా నివారణ చర్యల్లో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైజేపీ లయన్స్ క్లబ్ వారు లయన్ ఎస్ఎల్ఎన్ స్వామి సౌజన్యంతో గూడూరు పట్టణ అన్ని వార్డులలోని సచివాలయ కార్యాలయాలకు 'హోమియో పిల్స్'ను అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మురళీరాజు, ఆర్.వి.రావు, వి.వెంకటసుబ్బయ్య, కె.మంజులాదేవి, కె.బాబురావు, పి.వి. సుధాకర్, బి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ కోసం జ్యూట్‌బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు జ్యూట్ బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న వై.వి.రామిరెడ్డి

పర్యావరణ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19వ తేదీన వింజమూరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో ప్రజలకు జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. కేంద్ర పారిశ్రామిక, పర్యావరణ అనుమతుల కమిటీ సభ్యులు వై.వి.రామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వై.వి. రామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వై.వి.రామిరెడ్డి మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ కంపెనీ వారు తమ సామాజిక బాధ్యతలో భాగంగా 6500 జ్యూట్ బ్యాగులను, ఆక్వా ఎన్విరాన్‌మెంట్ వారు 5వేల జ్యూట్ బ్యాగులను నెల్లూరుజిల్లాకు వితరణగా అందజేశారన్నారు. వీటిలో 7500 బ్యాగులు వింజమూరు పంచాయితీకి, ఆత్మకూరు మండలంలోని మహిమలూరుకు 2వేల బ్యాగులను, చేజర్ల మండలం మాముడూరు గ్రామానికి 1400 బ్యాగులను, సంగం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు 600 బ్యాగులను అందజేసినట్లు చెప్పారు. ఈ బ్యాగులను అందజేసిన కంపెనీ యాజమాన్యాలను ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఐటిసి జనరల్ మేనేజర్ మోహన్‌కుమార్, ఎస్ఐ బాజిరెడ్డి, ఎంపిడిఓ స్వరూపరాణి, పంచాయితీ ఇ.ఓ గోపాలరావు, స్థానిక నాయకులు గణపం బాలకృష్ణారెడ్డి, గువ్వల కృష్ణారెడ్డి, మద్దూరు చిన్నకృష్ణారెడ్డి, మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, మద్దూరి గోపాల్‌రెడ్డి, ఖాజావలి, బి.సుబ్బారావు, బయ్యపురెడ్డి కేశవులురెడ్డి, గున్నం ప్రసాదరెడ్డి, గణపం రమేష్‌రెడ్డి, గూడా నరసారెడ్డి, ఎం.రాజగోపాల్, బయ్యపురెడ్డి శివ తదితరులు పాల్గొన్నారు.

• కాలధర్మం

# లెక్కల ఖని.. సాహితీ గని.. దుగ్గిశెట్టి రమణయ్య



పనిపట్ల నిబద్ధత, సమాజం పట్ల బాధ్యత, నిరాడంబరత, ఆచితూచి స్పష్టంగా మాట్లాడే నమ్రతల కలబోత దుగ్గిశెట్టి వెంకటరమణయ్య. మార్చి 16వ తేదీ తుది శ్వాస విడిచారు. ఆయన మరణంతో నెల్లూరు సాహితీ లోకం పెద్దదిక్కును కోల్పోయింది. నెల్లూరులో ఆడిట్ వ్యవస్థ కళ్ళు తెరచింది ఆయనతోనే. నెల్లూరులో తొలి చార్టర్డ్ అకౌంటెంట్‌గా ఆ వ్యవస్థకు గౌరవం, ప్రతిష్ఠ చేకూర్చారాయన. ఆయన్ను తలచుకొంటే ఇటు కవిగా, రచయితగా... అటు ఆడిటర్‌గా ఓ సమున్నత రూపం కనులముందు కదలుతుండేది.

దుగ్గిశెట్టి వెంకటరమణయ్య ఆడిటర్‌గా కుర్చీలో కూర్చున్నారంటే క్లయింట్లకు టెర్రర్. ఆయన ఏమి ప్రశ్నిస్తాడో అర్థంకాక తలలు పట్టుకొనేవారు. అది ఆయనకున్న విషయపరిజ్ఞానం ద్వారా సంక్రమించిన అధికారం. అంతలోనే తన మిత్రుడు భాగస్వామి జానకిరామయ్యతో జోక్‌లు వేసి నవ్వుకొనే సుగుణం. సాయంత్రం అయితే మళ్ళీ సాహితీలోకంలో నిమగ్నమవుతూ... ఇలా సాగేది ఆయన దైనందిన కార్యక్రమ సరళి. పరిపూర్ణ జీవితం గడిపి 95ఏళ్ళ వయసులో తనవు చాలించారాయన. వర్థమాన సమాజం అధ్యక్షులుగా, తిక్కన విజ్ఞాన కేంద్రం అధ్యక్షులుగా, మోచర్ల రామకృష్ణయ్య స్మారక ధర్మనిధి అధ్యక్షులుగా సాహితీ సంస్థల్లో సేవలందించారు.

## దుగ్గిశెట్టి కవీంద్రుని 'మరణం' తీరని లోటు

ఆయన పద్యకవితకు వీరాభిమాని. ఆయన రాసిన రమణీయ రామాయణము పద్యాల్లోనే విలసిల్లింది. అందరూ ఆయన పట్ల గౌరవంతో రమణయ్య రామాయణంగా పిలుచుకొనేవారు. మరణించిన తన భార్య పట్ల అనురాగంతో సతీస్మృతి ఎలిజీని రచించారాయన. సుందరాకాండము, ఉత్తర కాండము, భావవీచికలు, మబ్బు కబ్బము, గోదాదేవి చరితం, ప్రభాతగీతం ఆయన చేసిన సాహితీ రచనలు.

అప్పుడప్పుడూ 'లాయర్'లో వచన కవిత్వం రాసి 'లాయర్' పాఠకులకు కూడా పరిచయమయ్యారు. 'లాయర్' వ్యవస్థాపకులు కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డికి అత్యంత సన్నిహితులు. రామాయణ ప్రశస్తి సమావేశాలు ఏర్పరచి ప్రతి సంవత్సరం తన జన్మదినమైన ఏప్రిల్ 21న ఓ కవిని సత్కరించేవారు. తాను కవిత్వం రాయడమే కాక కవులను సత్కరించి ప్రోత్సహించిన సాహితీ తపస్వి, భాగ్యశీలి రమణయ్య. నెల్లూరులో ఎన్నో సాహిత్య సభలు ఆయన అధ్యక్షతన జరిగేవి. చిన్ని నారాయణరావు రాసిన 'అంతర్ముఖం' కవితా సంపుటి ఆవిష్కరణకు కూడా ఆయనే అధ్యక్షత వహించారు. తాను పద్యకవితను వ్రాసినా వచన కవిత్వాన్ని చక్కగా అభినందించేవారు. డా॥ నాగభైరవ కోటేశ్వరరావుతోనూ సాన్నిహిత్యం, సాహితీ సంభాషణ గావించేవారు. ఎన్నో సన్మానాలు సత్కారాలు అందుకొన్నా గర్వం పొడసూపక పోని గొప్ప గుణం ఆయనది. 'సరసకవితా చతుర'గా ఆయనకు బాపట్ల నాళం కృష్ణారాయ విజ్ఞానపీఠం బిరుదు ప్రదానం గావించారు.

ఆయన మరణంతో నెల్లూరు సాహితీ లోకం పెద్దదిక్కును కోల్పోయింది. తొలినాళ్ళ సీనియర్ చార్టెర్డ్ అకౌంటెంట్‌ను కోల్పోవడం దురదృష్టకరం. వీరికి ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. వాళ్ళ అబ్బాయి సుధాకరం చార్టర్డ్ అకౌంటెంట్‌గా తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్నాడు.

దుగ్గిశెట్టి రమణయ్య ఓ విజ్ఞాన ఖనిగా, నడిచే సాహితీ విద్యాలయంగా భాసిల్లేవారు. ఆయన మరణం అటు ఆడిట్ రంగానికీ ఇటు సాహితీకారులకు తీరనిలోటు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# పల్లెల వైపు పరుగులు

మానవ జీవితం నానాటికి యాంత్రికంగా మారుతూ ప్రజలంతా పల్లెలను వదిలి చదువుల కోసం, ఉద్యోగాల కోసం, వ్యాపారాల కోసం పట్టణాలకు, నగరాలకు పరుగులు తీస్తున్నారు. వృద్ధులు తప్పితే పల్లెల్లో నేటి తరం వారు నివాసం ఉండడం కష్టంగా మారుతోంది. కేవలం సంక్రాంతి పండుగ, లేదంటే తిరునాళ్ళు, జాతర సమయంలో మాత్రమే నగరాల్లో ఉండే వారికి తమ సొంత ఊర్లు గుర్తుకు వస్తున్నాయి. అయితే ఇప్పుడు కరోనా వైరస్ ప్రభావంతో ప్రజలు నగరాలు, పట్టణాలను వదిలి తమ సొంత గ్రామాలు, పల్లెల వైపు పరుగులు తీస్తున్నారు. దేశ వ్యాప్తంగా మూడు వారాల పాటు లాక్‌డౌన్ ప్రకటించడంతో నగరాల్లో జీవనం కష్టతరంగా మారుతోంది. దీనికి తోడు వైరస్ కేసులు నగరాల్లోనే ఎక్కువగా ఉంటున్నాయి. విదేశాల నుండి వచ్చిన వారు నగరాలు, పట్టణాల్లోనే అధికంగా నివసిస్తున్నారు. పల్లెలకు ఈ ప్రమాదం కొంతవరకు తక్కువే. పల్లెల్లో ఉండడం చాలా వరకు శ్రేయస్కరం అన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఈ కర్ఫ్యూ వాతావరణంలో పట్టణాల్లో కంటే కూడా పల్లెల్లో ఉంటే కొంత స్వేచ్ఛ ఉంటుంది. పదిమందితో కలిసి మాట్లాడే అవకాశం ఉంటుంది. ఇప్పుడు నగరమైనా పల్లెటూరు అయినా అంతా ఒకటే వాతావరణం. కాబట్టి చాలామంది పట్టణాలు, నగరాల నుండి తమ సొంత ఊర్లకు వెళ్లి అక్కడే గడుపుతున్నారు.

# భారీ అగ్ని ప్రమాదం

నెల్లూరు జిల్లా, చేజర్ల మండలం కాలాయపాళెం వద్ద భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో చేజర్లకు చెందిన చంద్రారెడ్డి అనే వ్యక్తికి గల 4 ఎకరాల జామాయిల్ తోట పూర్తిగా దగ్ధం అయింది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న ఫైర్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో 1.50లక్షల నష్టం వాటిలింది.

# కరోన

**చిన్ని నారాయణరావు**
**9440202942**

నిన్న –
ఐకమత్యానికి ప్రతీకగా
సామర్ధ్యాలకు పతాకగా
గ్లోబల్‌లో వెల్లివిరిసె చైతన్యం
నేడు –
ఐసోలేషన్ కానుకగా
రాష్ట్రాల మధ్య విఘాతం
తనువుల మధ్య శరాఘాతం
సూత్రధారికెందుకో
కన్నుకుట్టింది
కరోనా కరాళనృత్యం
ఊపందుకొంది
మనిషి మిగలాలంటే
దూరతీరాలే శరణ్యం
ఓర్వలేని విధాత
ఇచ్చెను బహుమానం!

# కరోనాకే.. కంగారు పుట్టింది!

అది న్యూయార్క్‌లోని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కార్యాలయం. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా ప్రధాని పుతిన్, జపాన్ ప్రధాని షింజో అబే, భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఇటలీ అధ్యక్షుడు బుకీ, ఇరాన్ నియంత ఖోమైనీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారులు సమావేశమయ్యారు. కరోనా వైరస్ ఎలా అరికట్టాలి అనేదానిపై అందరూ తలలు బద్దలు కొట్టుకుంటున్నారు. అయితే డోనాల్డ్ ట్రంప్ మాత్రం కరోనా వైరస్ పుట్టింది చైనాలో.. వ్యాపింప చేసింది చైనానే.. ప్రపంచంలో ఎవరూ తినని చెత్తాచెదారాన్నంతా వాళ్ళే తిన్నారు. ఎలుకలు, ఏనుగులు, నల్లులు, బల్లులు, చిలుకలు, ఉడతలు, పాములు, కప్పలు, తొండలు, తోడేళ్ళు, బొద్దింకలు, గబ్బిలాలు... ఒకటేమిటి, సకల జీవరాశిని ఆవురావురుమని తింటూ ఈ ప్రపంచానికి కరోనా వైరస్‌ను అంటగట్టారు వాళ్ళు. ఈ నష్టానికి ఆదేశమే బాధ్యత వహించాలి అని అన్నాడు. దానికి జిన్‌పింగ్ ఆవేశంగా లేచాడు. మేము ఈరోజు కప్పలు, కోతులు, పాములు, ఎలుకలు, బొద్దింకలు కొత్తగా తినడం లేదు, కొన్ని వందల ఏళ్లుగా తింటున్నాం. అప్పుడంతా రాని వైరస్ ఇప్పుడు వస్తుందా? మా మీద అనవసరంగా నిందలు వేయడం కరెక్ట్ కాదు. అసలు ఆ వైరస్ మీ సైనికుల ద్వారా వచ్చిందని ఎదురు దాడికి దిగాడు. అప్పుడు భారత ప్రధాని నరేంద్ర మోడీ కలుగజేసుకుని... ఇప్పుడు మీరు కొట్టుకుంటారని చెప్పి ఈ సమావేశం ఏర్పాటు చేయలేదు, ఈ వైరస్ ఎలా అరికట్టాలి అనేదానిమీద మనం మీటింగ్ పెట్టుకున్నాం... ఏదన్నా ఉంటే దానిమీద సలహాలు ఇవ్వండి అని కోరాడు. దానికి ట్రంప్, జిన్‌పింగ్ సంయుక్తంగా అలాంటి పనులు మాకు చేత కాదులే... అదేదో నువ్వే ఏడువు అని చేతులెత్తేశారు. అంతలో అక్కడకు ఓ అధికారి పరిగెత్తుకుంటూ వచ్చి... ట్రంప్ చెవిలో ఏదో ఊదాడు. అది విన్నాక ట్రంప్ మోడీవైపు సీరియస్‌గా చూస్తూ... నువ్వు స్నేహానికి ఇచ్చే విలువ ఇదేనా, మీరొక్కరే బాగుంటే సరిపోతుందా... మీ వద్ద ఉన్నది మాతో పంచుకోవాలనిపించ లేదా.. మేము బాగుపడడం మీకు ఇష్టం లేదా అని నిష్టూరంగా మాట్లాడాడు. ఆ మాటలకు మోడీకి మతిపోయినంత పనైంది. అసలు ఏమైంది... ఎందుకిలా మాట్లాడుతున్నావు అని ఆయన ట్రంప్‌ను అడిగాడు. దానికి ట్రంప్ ఉండి.. ఇంకా ఏం కావాలి... ప్రపంచం ఓ పక్క కరోనా వైరస్‌తో చస్తూ ఉంటే మీరు కరోనా వైరస్‌కు నివారణ మార్గం కనిపెట్టి కూడా మాకెవరికీ చెప్పడంలేదు. మావి మాత్రం ప్రాణాలు కావా అని అన్నాడు. అప్పుడు... మోడీ ఆశ్చర్యంగా మేము మందు కనిపెట్టామా.. అసలు ఆ విషయం నాకు తెలియదు... అసలు ఇంతవరకు దానికి మందే లేదు కదా అని అన్నాడు. వెంటనే జిన్‌పింగ్ అందుకని వైరస్‌ను అరికట్టాలంటే మెడిసిన్ అక్కర్లేదు, ఎన్నో మార్గాలు ఉంటాయి. అదేదో మీరు కనిపెట్టి ఉంటారు, అది ఇప్పుడు తెలిసింది. అదే ఆయన అడుగుతున్నాడు అని అన్నాడు. దానికి మోడీ అసలు నీకేం తెలుసు.. ఇంకా చెప్పండి అని కోరాడు. వెంటనే ట్రంప్ అందుకని... ప్రపంచంలో 197 దేశాలకు కరోనా వైరస్ పాకింది. ప్రతి దేశంలో ఈ వైరస్ ఒకరి నుంచి ఒకరికి సోకుతోంది... మా దేశంలో అయితే రెండు మూడు వారాల తేడాలోనే పాజిటివ్ కేసులు రెండంకెల్లో నుండి వేల సంఖ్యలోకి చేరుకున్నాయి. దీనిని కట్టడి చేయడం మాకు కష్టతరంగా ఉంది.

కానీ భారతదేశంలోని నెల్లూరు నగరంలో ఒక వైరస్ పాజిటివ్ కేసు బయటపడగా, అతని నుండి వైరస్ ఇంకొకరికి శోకలేదంటే మీరు వైరస్‌ను అక్కడే అరికట్టారు. ఈ వైరస్ ఒకరి నుండి ఒకరికి సోకకుండా చేయడమే దానిపై మనం సాధించే విజయం. దీనిని నెల్లూరులో సాధించారు. దీని వెనుక కారణాలు నాకు ఇప్పుడే తెలియాలి అని మొండికేశాడు. అప్పుడు మోడీ... దీని మీద నాకు పూర్తి సమాచారం లేదు. అందరం వెళ్లి అసలు విషయం ఏంటో కనుక్కుందాం పదండి అంటూ అందర్నీ అక్కడినుంచి లేపాడు.

★★★★★

అది నెల్లూరులోని ప్రభుత్వ సర్వజనాసుపత్రి ప్రాంగణం. అక్కడ ప్రధాని నరేంద్ర మోడీ, డోనాల్డ్ ట్రంప్, జిన్‌పింగ్‌లతో పాటు నెల్లూరు జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు, జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్‌పి భాస్కర్‌భూషణ్, మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్, కార్పొరేషన్ కమిషనర్ పివివిఎస్ మూర్తి, మాజీ మేయర్‌లు అజీజ్, భానుశ్రీ, పులిమి శైలజ, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనూరాధ, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు. మోడీ ఉండి వారితో... నెల్లూరులో కరోనా వైరస్ సోకిన పేషెంట్ నుండి ఆ వైరస్ ఇంకొకరికి శోక లేదంట... ప్రపంచమంతా ఈ వైరస్ ఒకరి నుండి ఒకరికి పాకుతూ మొత్తం విస్తరిస్తోంది, కానీ నెల్లూరులో మాత్రం విస్తరించకుండా ఒకరితోనే నివారించారు. ఇదెలా సాధ్యం అయిందని ప్రశ్నించాడు. దానికి కలెక్టర్ శేషగిరిబాబు సమాధానమిస్తూ... సార్, పేషెంట్‌ను గుర్తించగానే ఐసోలేషన్ వార్డుకు తరలించాం, ఆ వార్డు చుట్టూ ఐఆర్20-420, మున్సిపల్ కార్పొరేషన్ ముదురు దోమలను వదిలేశాం. అలాగే పేషెంట్ ఇంటి వద్ద కూడా ఈ దోమలను వదలడం జరిగింది. కరోనా వైరస్ పేషెంట్‌కు ఈ దోమలు కరిచేలా చర్యలు తీసుకున్నాం. ఒంటిలోని వైరస్‌ను రక్తం రూపంలో పీల్చి పిప్పి చేసే గుణం నెల్లూరు దోమలకు ఉంది. నెల్లూరు పేషంటు విషయంలో ఇదే ప్రయోగం చేశాం. ఆ పేషంట్‌లో ఉన్న వైరస్‌నంతా నెల్లూరు దోమలు హరించి వేసాయి. వైరస్ నిర్మూలన పూర్తిగా జరిగింది.

ఈ ప్రయోగం విజయవంతమైంది. కాబట్టి ఇప్పటికే మున్సిపల్ సిబ్బందిని రంగంలోకి దించాం. వీలైనన్ని ముదురు దోమలను పట్టి దేశంలో కరోనా పేషంట్లు వున్న అన్ని ఆసుపత్రుల వద్ద వీటిని వదలుతాం... అవి పేషంట్లలోని వైరస్‌ను రక్తం రూపంలో తాగి హరించేస్తాయి. ఈ రకంగా దేశం నుండి కరోనా వైరస్‌ను పారద్రోలుతామని, నెల్లూరు ముదురుదోమలు అత్యంత శక్తివంతమైనవని, కాబట్టే ఇంకొకరికి వ్యాపించే అవకాశం లేకుండా పోయిందని చెప్పాడు. అంతా విన్న ట్రంప్, జిన్‌పింగ్‌లు మాకు కూడా ఈ దోమలు కావాలంటూ తలా ఒక పాతిక మెట్రిక్ టన్నుల ఆర్డర్ పెట్టి అక్కడినుండి లేస్తూ.. అక్కడేవున్న అజీజ్, పులిమి శైలజ, భానుశ్రీ, అనూరాధలను చూసి వీళ్లెవరూ అని అడిగారు. దానికి అక్కడే వున్న మంత్రి అనిల్‌కుమార్ జోక్యం చేసుకుని నెల్లూరు నగరంలో ఈ అరుదైన ముదురుదోమల జాతి ఉత్పత్తికి, వాటి సంరక్షణకు కారకులు వీళ్ళే సార్ అని చెప్పాడు. అందుకు ట్రంప్... అట్లాగైతే ఈ ఏడాది నోబెల్ బహుమతులకు వీళ్ళనే ఎంపిక చేద్దామని ప్రతిపాదించాడు. ఆ మాటకు అందరూ చప్పట్లతో తమ ఆమోదం తెలిపారు.

# ఇళ్లలోంచి బయటకు రావొద్దు

- కరోనా కట్టడికి కట్టుదిట్టమైన ఆదేశాలు
- నిబంధనలను కఠినతరం చేసిన అధికారులు



లాక్‌డౌన్‌తో నిర్మానుష్యంగా మారిన నర్తకి సెంటర్

ప్రాణాంతకమైన కరోనా మహమ్మారి వ్యాధిని నియంత్రించేందుకు ప్రధాని నరేంద్రమోడీ దేశవ్యాప్తంగా ఈనెల 24 నుంచి 21 రోజుల పాటు లాక్‌డౌన్ ప్రకటించడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. నియమ నిబంధనలను కఠినతరం చేసి కరోనా వ్యాధి నిరోధానికి పూర్తిస్థాయిలో సమాయత్తమయ్యారు. జిల్లాలోనూ ఎవరూ ఇళ్ళలోంచి బయటకు రాకుండా, సామాజిక దూరాన్ని పాటించడం ద్వారా కరోనా వ్యాధిని తరిమికొట్టాలనే ఏకైక ధ్యేయంతో అధికారులు రేయింబవళ్ళు కృషి చేస్తున్నారు. ప్రతి ఇంటికి లక్ష్మణరేఖ ఉంటుందని, ఎవరికి వారు స్వీయనిర్బంధంలో ఇళ్ళలోనే ఉంటూ కరోనా వ్యాప్తిని కట్టడి చేయాలని ప్రధాని ఇచ్చిన పిలుపుతో అధికారులు వెంటనే స్పందించి నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు.

ఇప్పటికే 144 సెక్షన్ అమలుకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చి ఉండడంతో పాటు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ ప్రకటించడంతో ప్రజలు ఇళ్ళలోంచి బయటకు రాకుండా పదేపదే హెచ్చరికలు చేస్తున్నారు. కరోనా వ్యాధి ప్రపంచాన్ని వణికిస్తున్న నేపథ్యంలో దేశంలోని ప్రజలెవరికీ ఈ వ్యాధి వ్యాపించకుండా ఉండేందుకు ప్రజల బాగు కోసం, ప్రజల శ్రేయస్సు కోసం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జిల్లాలోనూ, నగరంలోనూ జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగం కరోనా నిరోధానికి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

ఈ భయంకరమైన వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించకుండా ఉండాలంటే ఎవరికి వారు ఇళ్ళలోనే ఉండాలని, కరోనా కట్టడికి ప్రతిఒక్కరూ సహకరించాలని అధికారులు పదేపదే ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎవరూ వీధుల్లోకి అనవసరంగా రాకుండా, గుంపులుగా తిరగకుండా, మరీ అత్యవసరమైతే తప్ప ఇళ్ళలోంచి ఎవరూ బయటకురాకుండా పోలీసు యంత్రాంగం పెద్దఎత్తున పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటుచేసి పోలీసుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచారు. కరోనా మహమ్మారి వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ ఇళ్ళలోంచి బయటకు రావద్దని, వీధుల్లో తిరగవద్దని మైకులు పెట్టి మరీ చెప్తున్నారు.

అయినా, ఇలా ఎంతగా బతిమిలాడి చెప్తున్నా మాట వినకుండా నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలపై తిరుగుతున్న అనేకమందికి పోలీసులు తమదైన శైలిలో తగు సమాధానం చెప్తున్నారు కూడా. దీంతో నగర వీధులు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు నిత్యావసరాలకు బాధలు పడకుండా జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. నిత్యావసర వస్తువులు, కూరగాయలు వగైరాల ధరలు పెరగకుండా సంబంధిత అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు.



నిబంధనలు అతిక్రమించి వీధుల్లో తిరుగుతున్న వారికి పోలీసుల గుంజిళ్ళు, లాఠీ దెబ్బల దండన

# కష్టకాలంలో మేమున్నామంటూ...

**కష్టసమయాల్లో బాధితులను ఆదుకునేందుకు మేమున్నామంటూ ఎంతోమంది సమాజసేవామూర్తులు భరోసా ఇస్తున్నారు. తమ శక్తికొద్దీ బాధితులకు సేవలందించి తమ సేవాభావం చాటుకుంటున్నారు. కరోనా నేపథ్యంలో జనతా కర్ఫ్యూ సమయంలో అన్ని దుకాణాలు, హోటళ్ళు మూతపడడం, ప్రజలెవరూ వీధుల్లోకి రాకపోవడంతో ఎంతోమంది దీనులు, అసహాయులు రోడ్లమీదున్న యాచకులు ఆకలికి అల్లాడిపోతున్న సమయంలో ఆయా ప్రాంతాల్లోని సమాజ సేవకులు వారికి తమవంతు సేవలందించి అందరి అభిమానానికి పాత్రులయ్యారు. పలువురు అధికారులు, స్వచ్ఛంద సేవకులు పలుచోట్ల ముందుకొచ్చి ఆకలితో బాధపడుతున్నవారికి అన్నం ప్యాకెట్లు, మంచినీరు అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు.**

## రెడ్‌క్రాస్ సేవలు అమోఘం



ప్రస్తుతం కరోనా వైరస్ మానవ సమాజాన్ని అతలాకుతలం చేస్తున్న తరుణంలో ప్రజలకు రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు అభినందనలందుకుంటున్నాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో ఇల్లు ఉన్న వారి పరిస్థితి కొంత ఫర్వాలేదు, మరి ఇల్లు వాకిలి లేని యాచకుల పరిస్థితి దుర్భరంగా ఉంది. వాళ్లకు తినడానికి తిండి లేదు, ఉండటానికి నీడ లేదు. ఈ పరిస్థితుల్లో నెల్లూరు రెడ్‌క్రాస్ వాళ్ళు ఎంతో దయార్ద్ర హృదయంతో ఆదుకుంటున్నారు. నెల్లూరు నగరంలో ఆయా ప్రాంతాలలో తలదాచుకుంటున్న యాచకులకు మూడు పూటలా ఆహార పొట్లాలు, మంచినీళ్ల అందజేస్తున్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న.. అమ్మానాన్న సేవాసదన్

కరోనా వైరస్ నియంత్రణకు భారత ప్రధాని నరేంద్రమోడీ జనతా కర్ఫ్యూకు పిలుపునివ్వడంతో ఈనెల 22న చిల్లకూరు మండలంలోని బూదనం టోల్‌ప్లాజా వద్ద నుండి చిల్లకూరు జాతీయరహదారి వరకు పెద్దసంఖ్యలో లారీలు తదితర వాహనాలు నిలబడిపోయాయి. సుమారు 50లారీలకు చెందిన డ్రైవర్లు, క్లీనర్లు ఆ సమయంలో భోజనసదుపాయం లేక ఆకలితో ఉండడాన్ని గమనించిన బూదనం గ్రామంలోని అమ్మానాన్న సేవాసదన్ వ్యవస్థాపకుడు చిరంజీవి, సభ్యులందరూ కలిసి వారందరికీ అన్నాన్ని, మంచినీటిని అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. వీరి సేవలను చూసి స్థానిక ప్రజలు మెచ్చుకున్నారు.

## వాలంటీర్ల సేవాభావం

కరోనా నేపథ్యంలో ప్రధాని పిలుపు మేరకు ఈనెల 22న జనతా కర్ఫ్యూ రోజున ఆత్మకూరులో రోడ్లన్నీ జనసంచారం లేక నిర్మానుష్యమయ్యాయి. ప్రజలు ఇళ్ళలోంచి బయటకు రాలేదు. దీంతో కొందరు అభాగ్యులు, అన్నార్తులు బస్టాండ్‌లలోనే ఆకలితో ఉండిపోయారు. ఇది గమనించిన 8వ వార్డు వాలంటీర్ జి.హరీష్‌నాయుడు, 4వ వార్డు వాలంటీర్ మోహన్‌లు రోడ్డుపక్కన కూర్చుని ఉన్న అభాగ్యుల ఆకలిబాధ తీర్చేందుకు సిద్ధమై ఆ అసహాయులకు అన్నపానాదులు అందజేసి తమ సేవాభావం చాటుకున్నారు. అధికారులు, ప్రజలు ఆ వాలెంటీర్ల మానవీయ సేవలను కొనియాడుతూ అభినందించారు.

## ప్రయాణీకుల ఆకలి తీర్చిన.. లక్ష్యా ఫౌండేషన్

జనతా కర్ఫ్యూ రోజున గూడూరులోని రైల్వేస్టేషన్‌లో దిగిన అనేకమంది దూరప్రాంతాల ప్రయాణీకులు గూడూరులో హోటళ్ళు, దుకాణాలు మూసివేసి ఉండడంతో ఆకలితో బాధపడుతుండగా గూడూరులోని లక్ష్యా చారిటబుల్ ట్రస్ట్ వారు వారికి ఆహారాన్ని, మంచినీటిని పంపిణీ చేసి తమ సేవానిరతిని చాటుకున్నారు. ట్రస్ట్ ఫౌండర్ ఇందుకూరు లక్ష్మీరెడ్డి, సభ్యులు చిరంజీవి తదితరులు ఈ సేవాకార్యక్రమంలో పాల్గొన్నారు.

## రోగులకు ఆహారపొట్లాల పంపిణీ

జనతా కర్ఫ్యూ రోజున కావలిలో అన్ని హోటళ్ళు మూతపడడంతో ఆసుపత్రుల వద్దకు వచ్చిన రోగుల సహాయకులు అనేకమంది ఆకలికి బాధపడుతుండడం గమనించిన మునిసిపల్ డిఇ శ్రీనివాసరావు ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకురావడంతో ఆయన ఎమ్మెల్యే రామిరెడ్డితో మాట్లాడి ఆహారం పంపిణీకి సిద్ధం అయ్యారు. పలు హోటళ్ళ యజమానులతో వారు సంప్రదింపులు జరపగా ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకుడైన గాదంశెట్టి ప్రసాద్ అందుకు వెంటనే మానవతా హృదయంతో స్పందించి అప్పటికప్పుడు 200 ప్యాకెట్ల పెరుగన్నం సిద్ధం చేశారు. వీటిని మునిసిపల్ కమిషనర్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్‌తో పాటు వైకాపా నాయకులు కనమర్లపూడి వెంకటనారాయణ తదితరులంతా కలిసి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఉన్న రోగుల సహాయకులకు, ఆకలికి అల్లాడుతున్న యాచకులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గాదంశెట్టి ప్రసాద్ దాతృత్వాన్ని అందరూ కొనియాడారు. ఈ కష్టకాలంలో ఇలా ఎంతోమంది ముందుకొచ్చి తమ సేవలను అందిస్తున్నారు.

# కొనుగోళ్ళకు నిర్ణీత వేళలు

**ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 7 గంటల వరకు**

కరోనా వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు దేశవ్యాప్తంగా లాక్ డౌన్ విధించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రైలు, రోడ్డు రవాణా, షాపులు, వాహనాల రాకపోకలకు పూర్తిగా నిషేధించారు. రోడ్లపైకి జనం రాకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. అత్యవసమైన పనులుంటే తప్ప ఎవ్వరినీ అనుమతించడం లేదు. కొన్ని కొన్ని సమయాల్లోనే నిత్యావసర సరుకుల కొనుగోలుకు అనుమతిస్తున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి అనిల్‌కుమార్‌తో చర్చించిన నెల్లూరు జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు నిత్యావసర సరుకుల కొనుగోలుకు సమయాలను ఖరారు చేశారు.

కూరగాయలతో పాటు నిత్యవసరమైన ప్రొవిజన్ వస్తువులు, పాలు, గుడ్లు, మందులు, పెట్రోల్‌ను నిర్ణీత సమయాల్లోనే కొనుగోలు చేసుకుని ఇళ్లకు వెళ్లిపోవాలని కలెక్టర్ సూచించారు. కేవలం వస్తువుల కొనుగోలుకు వచ్చేవారికే అనుమతి ఉంటుందని మిగిలిన వారికి అనుమతి లేదని స్పష్టం చేసారు. నిత్యావసరాల కోసం కాకుండా బయటకొస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 7 గంటల వరకు మాత్రమే బయటకు వచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుని ఇళ్లకు వెళ్లిపోవాలన్నారు. కొనుగోలు సమయంలో గుంపులు గుంపులుగా కాకుండా సామాజిక దూరం పాటించాలని కలెక్టర్ శేషగిరిబాబు ప్రజలను కోరారు.

# మందుల షాపులపై ఆకస్మిక తనిఖీలు

కరోనా వైరస్ నేపథ్యంలో మాస్కులు, శానిటైజర్లు అధికధరలకు విక్రయిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్ అధికారులు ఈనెల23న నెల్లూరు నగరంలోని పలు మందుల షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని కిమ్స్ ఆసుపత్రి వద్ద ఉన్న దేవిశ్రీ మెడికల్స్ దుకాణాన్ని తనిఖీ చేయగా మాస్కులు, శానిటైజర్లు వారు అధికధరలకు విక్రయిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించి వెంటనే ఆ దుకాణాన్ని సీజ్ చేశారు. నిత్యావసర వస్తువులను అధికధరలకు విక్రయిస్తున్నట్లు తెలిసినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు స్పష్టం చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సిఐలు మాణిక్యాలరావు, డిసిటిఓ విష్ణురావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు.

### 7 నుంచి 10వ తరగతి వరకు..

# పాఠ్యపుస్తకాలు సిద్ధం

## 6,35,431 పుస్తకాలు పంపిణీకి అధికారుల సన్నాహాలు

జిల్లాలోని ప్రభుత్వపాఠశాలల్లో 7 నుంచి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు సిద్ధమయ్యాయి. 6,35,431 పాఠ్యపుస్తకాలు విద్యాశాఖ గోడౌన్‌కు చేరుకున్నట్లు ఈ నెల 20న విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. వీటిని విద్యార్థులకు అందజేసేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో ఉన్న ఎంఇఓ కార్యాలయాలకు వాహనాల ద్వారా తరలించే కార్యక్రమం కూడా ప్రారంభమైంది. డిఇఓ జనార్ధనాచార్యులు పుస్తకాల గోడౌన్ వద్దనే ఉండి వీటిని అన్ని మండలాలకు తరలించే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. వీటితో పాటు మరో 11,732 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందని, అవికూడా త్వరలోనే వచ్చేస్తాయని అధికారులు చెప్పారు. వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు పునః ప్రారంభించే రోజున ఈ పుస్తకాలు పంపిణీ చేస్తారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఈ విద్యాసంవత్సరం కొనసాగుతున్న సమయంలోనే పాఠ్యపుస్తకాలను ముద్రించి జిల్లాలకు పంపించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**1 నుంచి 6 వరకు ఇంగ్లీష్‌మీడియం పుస్తకాలు**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 6వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు 2020-21 విద్యా సంవత్సరానికి ఇంగ్లీష్‌మీడియం ప్రవేశపెట్టాలని నిర్ణయించడంతో, ఇందుకు సంబంధించి ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం, విద్యార్థులకు నెలరోజుల పాటు బ్రిడ్జి కోర్సును ప్రారంభించడం కూడా జరిగాయి. 1 నుంచి 6వ తరగతి వరకు ఇంగ్లీష్‌మీడియం పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం ముద్రిస్తోంది. మరో నెలరోజుల్లోనే ఈ పాఠ్యపుస్తకాలు కూడా జిల్లాకు రానున్నాయని సమాచారం.

# ముగిసిన ముత్యాలమ్మ జాతర

## కరోనా దెబ్బతో గణనీయంగా తగ్గిన ఆదాయం

చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ అమ్మవారి జాతర అమ్మవారి సాగనంపు ఉత్సవంతో ఈనెల 20తో ముగిసింది. నాలుగురోజుల పాటు జరిగిన ఈ ఉత్సవంలో పోలేరమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు పెద్దఎత్తున పూజలు జరిగాయి. గ్రామవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో అమ్మవారి ఆలయానికి విచ్చేసే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గి, ఆదాయం కూడా తగ్గిపోయింది. టిక్కెట్ల విక్రయం ద్వారా 47,216 రూపాయలు, హుండీలో కానుకల రూపేణా 8,49,450 రూపాయలు వచ్చాయి. ముత్యాలమ్మ అమ్మవారి పేరిట వదిలిన దున్నల వేలం ద్వారా 5.85 లక్షలు వచ్చిందని, గత ఏడాదికంటే ఈసారి జాతర ఆదాయం బాగా తగ్గిపోయిందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. దేవాదాయశాఖ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఆలయ ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ఫోన్ కొట్టు.. ఆహార పదార్థాలు పట్టు

**- కమిషనర్ మూర్తి**

దేశంలో కరోనా వైరస్ ప్రభావాన్ని అరికట్టేందుకు ప్రధానమంత్రి పిలుపు మేరకు పటిష్టమైన చర్యలు చేపట్టామని, స్వీయ నియంత్రణలో ఉన్న పౌరుల సౌలభ్యం కోసం డోర్ డెలివరీ సదుపాయాన్ని కల్పిస్తున్నామని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ పివివిస్ మూర్తి ప్రకటించారు. నగరంలోని ప్రముఖ షాపింగ్ మాల్స్ యజమానులు, నిత్యావసర సరుకుల హోల్‌సేల్ విక్రయాల నిర్వాహకులతో ఈనెల 25న ఆయన చర్చించారు. అనంతరం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కరోనా వైరస్ వ్యాప్తి గొలుసును విచ్ఛిన్నం చేయడానికి ప్రజలంతా 21 రోజుల పాటు గృహ నిర్బంధంలో ఉంటూ ఖచ్చితంగా స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు.



ప్రజల నిత్యావసరాలను, భోజన సదుపాయాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శేషగిరిబాబుల సూచనల మేరకు ఆర్డీఓ, డిఎస్పీల సహకారంతో నూతన సౌలభ్యాన్ని కల్పించామని, ప్రధాన షాపింగ్‌మాల్స్‌కు ఫోన్ చేస్తే ఇంటికే సరుకులను సరఫరా చేసేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. అదే విధంగా స్విగ్గి, జొమాటో ఫోన్ అప్లికేషన్ల ద్వారా నిర్ణీత ఆహార పదార్థాలను నేరుగా వినియోగదారుని ఇంటికే సరఫరా చేసేలా ఆయా సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేశామని కమిషనర్ తెలిపారు. కరోనా వైరస్ వ్యాప్తిపై ప్రతిఒక్కరు అవగాహన పెంచుకుని స్థానికంగా ఎవరికైనా అలాంటి రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే కాల్ సెంటర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

### ఇంటర్ మూల్యాంకనం ప్రక్రియ

# 31 వరకు వాయిదా

కరోనా వైరస్ ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లాలో జరుగుతున్న ఇంటర్‌మీడియట్ జవాబుపత్రాలు దిద్దే మూల్యాంకనం ప్రక్రియ ఈనెల 31వ తేది వరకు వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఇంటర్‌బోర్డు కార్యదర్శి వి.రామకృష్ణ ఈనెల 20న జిల్లా ఇంటర్ బోర్డు అధికారులను ఆదేశించారు. ఇంటర్ మూల్యాంకనానికి 1600 మంది అధ్యాపకులకు పైగా హాజరవుతుండగా, వారికి ఎలాంటి అనారోగ్యం కలుగకుండా అధ్యాపకుల కోరికతో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. దీంతో నెల్లూరు నగరంలోని కెవిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఈ ప్రక్రియను నిలుపుదల చేసినట్లు ఆర్ఐఓ కె.శ్రీనివాసరావు తెలిపారు.

### కన్యకా పరమేశ్వరి దేవాలయంలో..

# భక్తిశ్రద్ధలతో శతరుద్ర చండీయాగం



నెల్లూరు స్టోన్ హౌస్ పేటలో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల 20న పంచాహ్నిక దీక్షతో శతరుద్ర చండీయాగం ఎంతో వైభవంగా నిర్వహించారు. దేవస్థానం పునర్నిర్మాణ కుంభాభిషేకాలు నిర్వహించి మండలం రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో ఈ విశేషపూజలు చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో కొలువుదీర్చి యజ్ఞాచార్యులు కనకమళ్ళ సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో యాగక్రతువు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సకల జనులందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ, కరోనా వైరస్ మహమ్మారి నుంచి మానవాళికి ప్రమాదం లేకుండా చూడాలని ప్రార్థిస్తూ అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారి సన్నిధిలో మహిళలు కన్నెపూజలు చేశారు. అనంతరం సామూహిక కోటి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, ఛైర్మన్ దాసా సురేష్‌రాజు, అయితా రామచంద్రరావు, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు సుంకు మనోహర్, సహాయ కార్యదర్శి దొంతంశెట్టి వివేకానందం, అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట సూర్యనారాయణ, సభ్యులు శ్రీరామ్ సురేష్, సరాబు సుబ్రహ్మణ్యం, పేర్ల సీతారామారావు తదితరుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# భారత్ లాక్‌డౌన్

(మొదటి పేజీ తరువాయి)

వైద్య సౌకర్యాల పరంగా టాప్ టెన్ దేశాలలో ఒకటిగా ఉండి, కేవలం 7కోట్ల జనాభా కలిగిన ఇటలీ ఈరోజు కరోనా వైరస్‌తో అతలాకుతలమైపోయింది. ఆ దేశంలో నెలకొన్న పరిస్థితులు భారత దేశంలో నెలకొంటే పరిస్థితి వూహించడానికి కూడా కష్టంగా ఉంటుంది. మన కున్న ఆసుపత్రులు చాలవు. ఆసుపత్రులలో బెడ్‌లు చాలవు, డాక్టర్లు చాలరు, వెంటిలేటర్లు చాలవు... రోగులు వేలల్లోకి చేరితేనే మనం డేంజర్‌లో పడ్డట్టు... అలాంటిది లక్షల్లోకిపోతే... ప్రభుత్వాలు కూడా ఏమీ చేయలేని దుస్థితి వస్తుంది. అంత దాకా పరిస్థితులు రాకుండా వైరస్‌ను కంట్రోల్ చేయడం కోసమే భారత ప్రధాని నరేంద్ర మోడీ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. దేశ ప్రజలనుద్దేశించి ఆయన చేస్తున్న ప్రసంగాలు ఉద్వేగభరితంగా ఉంటున్నాయి. దేశానికి ఒక ప్రధానిగా కాకుండా మీ కుటుంబసభ్యుడిగా నన్ను భావించి మిమ్మల్ని మీరు నియంత్రించుకోండంటూ ఆయన ఇస్తున్న పిలుపులు దేశ ప్రజలను కదిలిస్తున్నాయి.

ప్రధాని నరేంద్రమోడీ కరోనా వైరస్‌ను అరికట్టే యుద్ధంలో భాగంగా మార్చి 22వ తేదీన దేశ వ్యాప్తంగా జనతా కర్ఫ్యూకు పిలుపునిస్తే దేశమే స్తంభించిపోయింది. 130కోట్ల మంది ప్రజలు జనతా కర్ఫ్యూకు స్వచ్ఛందంగా మద్దతు పలికారు. అంతే కాదు, ప్రధాని పిలుపుతో కరోనా వైరస్ నేపథ్యంలో తమ సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందికి, పోలీసులకు, పారిశుద్ధ్య కార్మికులకు, మీడియాకు ప్రజలు తమ చప్పట్ల ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

**మూడు వారాలు లాక్‌డౌన్**

కరోనా వైరస్ మహమ్మారిని పారద్రోలే పని ఒక్కరోజులో పూర్తికాదని గుర్తించిన ప్రధాని నరేంద్ర మోడీ మూడు వారాల పాటు దేశమంతటా లాక్‌డౌన్‌కు పిలుపునిచ్చారు. అంటే ఒకరకంగా ఇది కర్ఫ్యూనే! ప్రజలు తమను తాము నిర్బంధించుకోవడం ద్వారా వైరస్ చైన్‌ను ఛేదించగలరు... ఈ వైరస్‌ను నిలువరించాలంటే ప్రజా సమూహాలు నిలిచిపోవాలి. ప్రజలు గుమికూడడం ఆగిపోవాలి. ప్రజలు కొన్ని రోజుల పాటు ఇళ్ళవద్ద వుంటేనే ఈ చైన్ అగిపోతుంది. ఎప్పుడైతే కరోనా వైరస్ కొత్త కేసులు ఆగిపోతాయో అప్పుడు మనం కొంత సేఫ్ జోన్‌లో వున్నట్లు లెక్క. కేసులు పెరిగినన్ని రోజులు మనం గృహ నిర్బంధంలో వుండక తప్పదు.

**ఎమర్జెన్సీ దాటేశాం**

స్వర్గీయ ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీ విధించడం తెలిసిందే! అయితే అప్పుడు రాజకీయ స్వార్థంతో ఎమర్జెన్సీ విధించడం జరిగింది. కాని ఇప్పుడు ప్రజల రక్షణ కోసం విధించుకున్న ఎమర్జెన్సీ ఇది. అంతర్జాతీయ సరిహద్దులు మూసేశాం, విమానాలు ఎగరడం లేదు, పట్టాలపై రైళ్లు పరుగులు తీయడం లేదు, బస్సులు, లారీలు పూర్తిగా రవాణా వ్యవస్థ ఆగిపోయింది. వ్యాపార వాణిజ్య సంస్థలన్నీ మూతపడ్డాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆసుపత్రులు, పోలీసు, కొన్ని అత్యవసర విభాగాలు తప్పితే ఇంకే వ్యవస్థలూ పనిచేయడం లేదు.

కరోనా వైరస్‌పై భారతదేశం పెద్ద యుద్ధమే చేస్తోంది. దీనిమూలంగా మన ఆర్థికంగా ఎంతో నష్టపోవచ్చు. కాని ఈ వైరస్‌ను నిర్లక్ష్యం చేస్తే మాత్రం భవిష్యత్‌లో ఆర్థిక నష్టాన్నే కాదు, ప్రాణ నష్టాన్ని కూడా తీవ్రస్థాయిలో చవిచూడాల్సి వుంటుంది. కాబట్టి కరోనా వైరస్‌పై భారత ప్రభుత్వం చేస్తున్న యుద్ధానికి ప్రజలంతా వెన్నుదన్నుగా నిలవాలి. అమెరికా అంతటి అగ్రరాజ్యం కాకపోయినప్పటికీ కరోనా వైరస్‌పై పోరాటంలో భారత ప్రభుత్వం చొరవ, స్ఫూర్తిని అగ్రదేశాలు సైతం అభినందిస్తున్నాయి. ఈ పోరాటంలో ప్రధాని మోడీ వెంటే మేమంతా అంటూ ప్రజలు సంపూర్ణ మద్దతునివ్వాలి.

# వరల్డ్‌ను చుట్టేసిన వైరస్

(మొదటి పేజీ తరువాయి)

ఆ శత్రువుపై విజయం సాధించడం కోసం అహర్నిశలు శ్రమిస్తూనే వున్నాయి. ఆ శత్రువు పేరే 'కరోనా వైరస్'. ఈ ప్రపంచంలో మానవ వికాసానికి ఒక్కో దేశం ఒక్కో బహుమతిని అందిస్తే, మానవ వినాశనానికి చైనా అందించిన బహుమతి ఈ వైరస్. ఆ దేశంలోని వూహాన్ నగరంలో పుట్టిన ఈ వైరస్ కేవలం రెండండే రెండు నెలల కాలంలో ప్రపంచంలోని 200దేశాలను చుట్టేసింది. ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ బాధితుల సంఖ్య ఐదులక్షలకు తాకింది. మృతుల సంఖ్య 20వేలకు దాటింది.

**ప్రపంచయుద్ధాలకంటే ప్రమాదం**

ఇప్పటికి రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. లక్షల్లో ప్రాణ నష్టం సంభవించింది. అయితే ఆ యుద్ధం కూడా కొన్ని దేశాలకే పరిమితమయ్యాయి. కాని ఈ కరోనా వైరస్ 200 దేశాల మీద యుద్ధం ప్రకటించింది. వైరస్ వ్యాప్తి అత్యంత వేగవంతంగా జరుగుతోంది. ఈ వైరస్ ఒకరి నుండి వందలమందికి, వందలమంది నుండి లక్షల మందికి కొద్ది రోజుల్లోనే వ్యాపిస్తూ ప్రపంచానికి అత్యంత ప్రమాదకరంగా మారుతోంది.

**చైనా కోలుకుంది... మిగతా దేశాలు మునిగాయి**

కరోనా వైరస్ జన్మభూమి అయిన చైనా మాత్రం ఈ వైరస్ మహమ్మారి నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అయితే ఈ మహమ్మారి బారినపడిన ఇటలీ, ఇరాన్, స్పెయిన్, ఫ్రాన్స్ వంటి దేశాల్లో మాత్రం మరణమృదంగం మార్మోగుతోంది. కరోనా వైరస్ దెబ్బకు బలైపోయిన తొలి దేశం ఇటలీ! ఆ దేశంలో శ్మశాన వైరాగ్యం నెలకొంది. ఈ వైరస్ పట్ల అప్రమత్తం కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాపానికి భారీ మూల్యమే చెల్లిస్తోంది ఆ దేశం. అభివృద్ధి చెందిన దేశమైనప్పటికీ కూడా రోజురోజుకీ పెరుగుతున్న వ్యాధిగ్రస్తులకు సరైన వైద్య చికిత్స అందించలేక, పెరుగుతున్న మరణాల సంఖ్యను ఆపలేక ఆ దేశ పాలకులే చేతులెత్తేశారు. స్పెయిన్, ఇరాన్, ఫ్రాన్స్, అమెరికాలలో సైతం కరోనా కరాళనృత్యం చేస్తోంది.

# హద్దు మీరిన తెలంగాణ యంత్రాంగం

- **ఆంధ్ర సరిహద్దులో పనిచేయని మంత్రాంగం**
- **విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వాల విచిత్ర వైఖరి**



***ఒకవైపు ప్రపంచమంతా కరోనా గడగడలాడిస్తుంటే.. మరో వైపు ప్రభుత్వాలు తీసుకుంటున్న మూర్ఖపు చర్యలతో ప్రజలు నలిగిపోతున్నారు. ఇందుకు ఉదాహరణే 25వ తేదీ అర్ధరాత్రి తెలంగాణ-ఆంధ్ర సరిహద్దు గరికపాడు చెక్ పోస్టు వద్ద జరిగిన సంఘటన.***

భారతదేశమంతా లాక్‌డౌన్ ప్రకటించి.. ఒకరకంగా ఇది కర్ఫ్యూలాంటిదే అని సాక్షాత్తు భారతదేశ ప్రధాన మంత్రి ప్రకటించిన 24 గంటలలోపే జరిగిన ఈ సంఘటన పాలకుల నిర్లక్ష్యంతో జరిగిన సిగ్గుచేటు ఘటనగా చరిత్రలో మిగిలిపోతుంది.

హైద్రాబాదులో వివిధ ప్రాంతాలలో వున్న హాస్టళ్లు, పిజి సెంటర్లలో నివసిస్తున్న ఆంధ్రాప్రాంత వారిని ఆంధ్రకు వెళ్ళడానికి ఆయా ప్రాంత పోలీస్‌స్టేషన్లలో అనుమతి తీసుకుని వెళ్లిపోవచ్చని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. అంతే వేలాది మంది పోలీస్ స్టేషన్లముందు క్యూలు కట్టారు. పాసులు తీసుకుని రాష్ట్ర సరిహద్దుకు చేరారు, ఇక్కడే అసలు సమస్య మొదలయ్యింది. ఎలాంటి పరీక్షలు చెయ్యకుండా ఇంతమందిని రాష్ట్రంలోకి ఎలా అనుమతిస్తామంటూ ఆంధ్రా పోలీసు అధికారులు అడ్డుకున్నారు. మూటాముల్లె సర్దుకుని మోటార్‌సైకిళ్ళలో కొందరు, పిల్లాజల్లాతో కార్లలో కొందరు... ఇలా వేలాదిమంది వందల కిలోమీటర్లు ప్రయాణించి సాయంత్రానికల్లా ఒక్కచోటకు చేరిపోయారు. ఒక్కరూ లేదా ఇద్దరే బయట కనిపించాలనే నిబంధనలున్న తరుణంలో ఇలా వేలమందిని ఒక్క చోటకు చేర్చే తుగ్లక్ ఆలోచన అధికారులు లేదా ప్రభుత్వ పెద్దలు ఎలా చేసారో అర్థం కావడంలేదు.

## కుటుంబాలు ఎలా వచ్చాయి?

ఇక్కడ ఒక విషయం గమనిస్తే... ఒకవేళ తెలంగాణ హాస్టళ్ళలో నివాసముంటున్న ఆంధ్ర ప్రాంతం వాళ్ళు ఒంటరిగా ఉంటున్నారు కాబట్టి వాళ్ళ ఇబ్బందులను గమనించి తెలంగాణ ప్రభుత్వం ఈ ఆలోచన చేసి ఉంటే... ఆయా పోలీస్‌స్టేషన్లలో వారికి వ్రాతపూర్వక అనుమతినిచ్చేటప్పుడు ఒకరు లేదా ఇద్దరికే ఇచ్చి వుండాలి. ఈ నిబంధన కేవలం హాస్టల్స్‌లో లేదా పీజీలలో ఉన్నవారికే వర్తిస్తాయని చెప్పినప్పుడు కొంతమంది పిల్లా, పెద్దలతో కుటుంబాలు కుటుంబాలు తరలివచ్చాయి. అలా కుటుంబ సమేతంగా రావడానికి తెలంగాణ ప్రభుత్వం ఎలా అనుమతిచ్చిందో చూస్తే... విడ్డూరమేస్తుంది. ఈ ప్రక్రియపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాట్లాడుకున్నారా? లేక అధికారులే మాట్లాడుకున్నారా? ఒకవేళ ఇరు వర్గాలలో ఎవరు మాట్లాడుకుని వున్నా, రోజుకు 50మందినో లేక వందమందినో అనుమతించాలనే ఆలోచన చేయకుండా ఇలా ఒకేసారి 4 నుండి 5వేల మందికి అనుమతులివ్వడం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోంది.

## దీనినీ రాజకీయం చేసిన తెదేపా

ఈ సరిహద్దు ప్రాంతంలో కూడా తెలుగుదేశం పార్టీ తమ పెయిడ్ ఆర్టిస్టలను రంగంలోకి దించి కర్కశ కరోనా ఉదంతాన్ని సైతం రాక్షస రాజకీయ క్రీడగా మలచుకోవాలని చూసినట్లు కనిపిస్తోంది. అక్కడ ఆంధ్రాలోకి అనుమతి లభించని కొంతమంది జగన్మోహన్‌రెడ్డిని, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ దుమ్మెత్తిపోయడం గమనిస్తే... ఈ అవకాశాన్ని తెలుగుదేశం పార్టీ తమ రాజకీయ స్వార్థానికి ఎంత తెలివిగా వాడుకుందో అర్థమవుతుంది. ఇక్కడ తప్పు ఎవరిదైనా ఇందులో అవకాశవాదాన్ని చూపింది మాత్రం తెలుగుదేశం. యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారిని సైతం రాజకీయ స్వార్థాలకి వాడుకోవడం ఒక్క తెలుగుతమ్ముళ్ళకే చెల్లింది. ఒక్కసారిగా వేలమందిని మన రాష్ట్రంలోకి అనుమతిస్తే జరగబోయే నష్టాన్ని కూడా అంచనా వేయకుండా తమ రాజకీయ ప్రాబల్యం కోసం పిచ్చి ప్రకటనలు చేయడం ఆ పార్టీ అవివేకాన్ని చెప్పకనే చెప్తోంది.

## పొరపాటు జరిగింది - వైయస్ జగన్

గురువారం ఆంధ్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి బుధవారం నాడు జరిగిన పొరపాటుని తొందరపాటు చర్యని, భవిష్యత్‌లో ఇలాంటివి మళ్ళీ జరగకుండా చూస్తానని, ఏప్రిల్ 14వరకు దయచేసి ఎక్కడివారు అక్కడే ఉండిపోవాలని, రాష్ట్ర సరిహద్దుల్లో ఎక్కడకూడా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వంతో సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ముఖ్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో తాను మాట్లాడానని, ఆ రాష్ట్రాలలో వున్న ఆంధ్ర ప్రాంత వాసులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూస్తామని కేసీఆర్‌తో పాటు ఇతర రాష్ట్ర ముఖ్యమంత్రులు కూడా హామీ ఇచ్చారని చెప్పాడు.

## కరోనా వైరస్ నివారణ కోసం...
# ముఖ్యమంత్రి సహాయ నిధికి విపిఆర్ విరాళం



కరోనా వైరస్ నివారణ కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన ఎంపి నిధుల నుండి 1కోటి 65 లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించారు. అలాగే విపిఆర్ ఫౌండేషన్ ద్వారా నెల్లూరుజిల్లాలో దళిత బడుగు బలహీన వర్గాల ఆరోగ్యం కోసం, వారంతా ఈ వైరస్ బారిన పడకుండా నివారిం చడం కోసం 1.5లక్షల శానిటైజర్లను పంపిణీ చేయాలని కూడా ఆయన నిర్ణయించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ ఆపత్కాలంలో ప్రజలకు తన సందేశమిస్తూ... ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న కరోనా వైరస్ నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిలు ఇచ్చిన పిలుపుమేరకు లాక్‌డౌన్‌ను చిత్తశుద్ధితో పాటించాలని, వైద్యనిపుణుల సలహాలు పాటించి పరిశుభ్రంగా ఉండాలని, మనం తీసుకునే జాగ్రత్తలే మన ప్రాణాలకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ప్రతి ఇల్లు, ప్రతి పల్లె, ప్రతి ప్రాంతం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎంతో ముందుచూపుతో ముఖ్యమంత్రి నియమించిన వాలంటరీ గ్రామ సచివాలయ వ్యవస్థలు ఈరోజు ఒక సైన్యంలా పని చేస్తున్నాయని, ఈ ఆపత్కాలంలో తమ సేవలందిస్తున్న వైద్యసిబ్బందికి, పోలీసులకు, పారిశుద్ధ్య కార్మికులకు అన్ని ప్రభుత్వ విభాగాలకు, స్వచ్ఛంద సంస్థలకు ఆయన అభినందనలు తెలిపారు. కరోనా వైరస్ నివారణ కోసం మాస్క్‌లు, గ్లౌజులు, శానిటైజర్లు, థర్మల్ స్కానర్లు నెల్లూరు ప్రజలకు క్వారంటైన్‌కు గాని, హాస్పిటల్స్‌కు గాని కావాలంటే విపిఆర్ ఫౌండేషన్ ద్వారా చేయూతనిస్తామని ఆయన వెల్లడించారు. విదేశాలనుండి వచ్చిన వారు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన వారు 14 రోజులు తప్పక క్వారంటైన్‌కు వెళ్లాలని విజ్ఞప్తి చేసారు.

## డా. కిషోర్స్ రత్నం 2 లక్షల విరాళం



కర్కశ కరోనా భాదితుల సహాయార్థం 2 లక్షల రూపాయల విరాళాన్ని చెక్కురూపంలో ముఖ్యమంత్రి సహాయనిధి కోసం డా. కిషోర్స్ రత్నం స్కూల్స్ తరపున ఆ స్కూల్ జనరల్ మేనేజర్ రామూర్తినాయుడు గురువారం రూరల్ ఎంఎల్ ఏ శ్రీధర్ రెడ్డికి అందచేశారు.



ఈ నెల 26వ తేదీ గురువారం ఉదయం నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో లాక్‌డౌన్ నేపథ్యంలో పరిస్థితులను పర్యవేక్షిస్తూ... అటుగా వచ్చిన వాహనదారులకు అనవసరంగా రోడ్ల మీదకు రావద్దని సూచనలు చేస్తున్న రాష్ట్ర జలనవరుల శాఖామంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్, పక్కన విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి



కర్కశ కరోనా దాటికి ఆకలితో అల్లాడిపోతున్న భిక్షగాళ్లను రెడ్‌క్రాస్ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో ఆదుకుని ఆకలి తీరుస్తున్న సందర్బంగా రెడ్‌క్రాస్ సేవలను చూసి స్పందించి ఉడతా భక్తిగా తనవంతు 10,000/- రూపాయలను గురువారం చంద్రశేఖర్‌రెడ్డికి అందించి, ఇతరులకు స్ఫూర్తిగా నిలిచిన నెల్లూరు నగరంలోని ఇన్సూరెన్స్ ఏజెంట్ నవీన్‌సింగ్.


## ఉత్తరక్రియలు



ఉన్నతమైన వ్యక్తిత్వంతో
అంకితభావం, నిబద్ధత ఊపిరిగా
ఎందరికో ఆదర్శప్రాయులైన
మా ఇంటిదైవం
శ్రీ దుగ్గిశెట్టి
వేంకట రమణయ్య గారు
16-03-2020 తేదీన స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మ శాంతికై
భగవంతుని ప్రార్థిస్తూ...
శోకతప్త హృదయాలతో...

స్వ॥ డి.వి.రమణయ్య గారు
సీనియర్ చార్టెర్డ్ అకౌంటెంట్
జననం: 21.04.1925 మరణం : 16.03.2020

కుమారులు - కోడళ్ళు
దుగ్గిశెట్టి భాస్కర్ - మాధవి
దుగ్గిశెట్టి సుధాకరం - జ్యోత్స్న
Chartered Accountant
దుగ్గిశెట్టి రవి - కళావతి

కుమార్తెలు - అల్లుళ్ళు
సరోజనమ్మ W/o Late మెంటా ఉదయ్‌కుమార్
యమున W/o Late అంబటి నారాయణమూర్తి
కమల - మునుస్వామి దివాకరన్
అనూరాధ - ముల్లంగి శ్రీనివాస్

మనుమలు - మనుమరాండ్రు : దుగ్గిశెట్టి భరత్ - లావణ్య, అపర్ణ - పసుమర్తి సుబ్రహ్మణ్యం, మెంటా ప్రసన్నకుమార్ - విజయ, మెంటా హరికృష్ణ - సునీత, అంబటి శ్రీనివాస్ - కాత్యాయిని, అంబటి చంద్రశేఖర్ - భారతి, కస్సెట్టి లక్ష్మి - రవికుమార్, శ్రావణి - అర్జున్, ఆదిలక్ష్మి - లింగేశ్వరన్, అర్చన - జయకృష్ణ, లలితశ్రీ - సతీష్, లలిత - సుమన్, ముల్లంగి విజయ్ - దివ్య, పుణ్యమూర్తుల రాధిక - హరినాథ్, దుగ్గిశెట్టి పద్మజ, దుగ్గిశెట్టి రోహిణి

మునిమనుమలు మరియు మునిమనుమరాండ్రు

ఉత్తరక్రియలు: తేది 30-3-2020 సోమవారం శిలోద్వాసన, 31-3-2020 మంగళవారం, పాత్తర్లు, సపిండీకరణ, 1-4-2020 బుధవారం వైకుంఠ సమారాధన నెల్లూరు జేమ్స్‌గార్డెన్, SRMT ఎదురుగాగల మా స్వగృహము నందు జరుగును. సమయాభావం వల్ల పత్రికాముఖంగా బంధుమిత్రులకుతెలియజేయడమైనది.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com